J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12
THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 25 22.11.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మీడియా ఫర్ సేల్

# ఇచ్చట వార్తలు అమ్మబడును




## నేతలు, మీడియా అధిపతుల మధ్య క్విడ్‌ప్రోకో

### రాజకీయ పార్టీలు, నాయకుల కొమ్ము కాసినందుకు పదవులు, కాంట్రాక్టులు

### విస్తరిస్తున్న వింత సంస్కృతి... కరపత్రాలుగా మారుతున్న పత్రికలు

**సమాజంలో నాలుగు మూల స్థంభాలలో ఒకటైన మీడియా ఇప్పుడు అంగట్లో ఆట బొమ్మగా మారింది. రాజకీయ పదవుల కోసం, ఆర్థిక అవసరాల కోసం, కోట్లరూపాయల కాంట్రాక్టుల కోసం మీడియా యాజమాన్యాలు రాజకీయపార్టీల చేతుల్లో కీలుబొమ్మలుగా తయారయ్యాయి. తమ అవసరాలు తీర్చే నాయకులకి, వారి రాజకీయ పార్టీలకి సలాములు కొడుతూ ఆయా సంస్థల అధినేతలు గులాములుగా మారిపోయారు. తమ సొంత భజన కోసం తామే పత్రికలని, టీవీ ఛానెళ్ళని వైసీపీ లాంటి పార్టీలు తామే సొంతంగా ప్రారంభించుకుంటే, స్వతంత్రంగా అవతరించిన పత్రికలు, ఛానెళ్ళు తమ అవసరాలు తీర్చేవారికి బానిసలుగా మారిపోయాయి. జాతీయ స్థాయిలో నడిచే ఆంగ్ల పత్రికలు, ఆంగ్ల ఛానెళ్ళు అన్నీ ఇదే పోకడ అవలంభిస్తున్నాయి. రాష్ట్రాలలో సైతం మీడియా రాజకీయ నేతల అవసరాలు తీరుస్తూ తమ పబ్బం గడుపుకుంటోంది. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఇదే పరిస్థితి. స్థానిక సంస్థలు, ప్రముఖ ఆలయాల ఛైర్మెన్ పదవుల నుండి రాజ్యసభ సభ్యత్వం వరకూ అర్హతని బట్టి మీడియా యాజమాన్యానికి రాజకీయపార్టీలు పదవులు కట్టబెట్టి తమ ఋణం తీర్చుకుంటున్నాయి. వారితో తమ అవసరాలు చక్కబెట్టుకుంటున్నాయి.**

జాతీయస్థాయిలోని పలు మీడియా సంస్థలు ప్రముఖ సర్వే సంస్థలతో ఎన్నికలపై సర్వేలు చేయిస్తున్నాయి. వచ్చిన డేటాను పార్టీల అధినేతలకు చూపించి వారితో బేరం కుదుర్చుకుంటున్నాయి. వారికి అనుకూలంగా డేటాను మార్చేసి సర్వే ఫలితాలను ప్రకటిస్తున్నాయి. కౌంటింగ్ తర్వాత ఫలితాలు తారుమారయితే, సర్వేల్లో ప్లస్ ఆర్ మైనస్ సాధారణమే కదా..! అంటూ తప్పించుకుంటున్నాయి. ఒకప్పుడు ఎన్నికల వేళ మాత్రమే నేతలకు, పార్టీలకు అనుకూలంగా వివిధ ఛానెళ్ళు, పత్రికల్లో వార్తలు, కథనాలు రావడానికి చెల్లింపులు జరిగేవి. వీటిని ప్రచురణ విభాగంలో పెయిడ్ ఆర్టికల్స్ అంటారు. ఎలక్ట్రానిక్ మీడియాలో పెయిడ్ స్టోరీస్ అంటారు. ఇప్పుడు అలాకాదు. పూర్తిగా ఒక పార్టీకి అనుకూలంగా, మరో పార్టీకి ప్రతికూలంగా వ్యవహరించేలా మీడియా మారిపోయింది. సమాజానికి, ప్రజలకు వాచ్‌డాగ్‌లా ఉండాల్సిన మీడియా.. పార్టీల అజెండా మోయడానికే పరిమితమవుతోంది.

### భజనే అర్హతగా పదవులు!

'పత్రికొక్కటున్న పదివేల సైన్యము, పత్రికొక్కటున్న మిత్రకోటి, ప్రజలకు రక్ష లేదు పత్రిక లేనిచో" – ఇది ప్రముఖ పాత్రికేయులు దివంగత నార్ల వెంకటేశ్వరరావు చెప్పిన విలువైన మాట. ఈ మాటకు నేడు అర్థం మారిపోయింది. ఆ మాటలోని 'పదివేల సైన్యం' రాజకీయ నేతలకు, ప్రభుత్వాలకు పనిచేసే పరిస్థితి వచ్చింది. మిత్రకోటి కూడా నేతలకే. 'మాకు అది, మీకు ఇది' అని తెలుగులో అర్థం చెప్పుకునే "క్విడ్‌ప్రోకో" పత్రికాధిపతులు, రాజకీయనేతలు, ప్రభుత్వాల

10లో

## ద్వితీయ వర్ధంతి


జననం : 1924 నిర్యాణం : 2022

అమ్మా...
నిష్కల్మషమైన ప్రేమను పంచిన
స్వచ్ఛమైన మనసు మీది..
అడిగినవారికి లేదనకుండా
సాయంచేసిన సహృదయం మీది.
మా జీవితాలలో వెలుగులు నింపిన
అనురాగమూర్తి మీరు..
మాలో సేవాస్ఫూర్తిని వెలిగించిన
ఆత్మీయదీప్తి మీరు.

## శ్రీమతి బోగొల్లు పిచ్చమ్మ గారు

పరమపదించి తేది. 24.11.2024 నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ... వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు
డాక్టర్ బోగొల్లు ప్రభాకర్‌రెడ్డి - డాక్టర్ సరోజిని, నెల్లూరు
బోగొల్లు మోహన్‌రెడ్డి, మోహన్ అసోసియేట్స్ - నిర్మలమోహన్, హైదరాబాదు

మనుమళ్ళు - మనుమరాళ్ళు
బోగొల్లు సతీష్ - స్వప్న బోగొల్లు సత్యనాథ్ - సృజన
బోగొల్లు ఉదీప్ - అనిత బోగొల్లు సందీప్ - సరిత
మరియు మునిమనుమళ్ళు, మునిమనుమరాళ్ళు



# కొండ బిట్రగుంటకు కొత్త వెలుగులు

## శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ మహాప్రాకారం.. గాలిగోపుర నిర్మాణాలకు భూమిపూజ చేసిన జగద్గురు శ్రీ విధుశేఖర భారతీమహాస్వామి

## పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి




నెల్లూరుజిల్లా బోగోలు మండలంలోని కొండ బిట్రగుంటకు సరికొత్త వెలుగులు రానున్నాయి. అక్కడ వెలసివున్న ప్రాచీన పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి బాటలు పడుతున్నాయి. ఇటీవల శృంగేరి శారద పీఠ జగద్గురువులు, పూజ్యశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి ఈ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ మహాప్రాకారం, గాలిగోపురం నిర్మాణాలకు స్వామీజీ భూమిపూజ చేశారు. తొలుత స్వామీజీకి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. రూ. 2.60 కోట్లతో ఆలయ గాలిగోపురం, రూ. 1.65కోట్లతో ఆలయ మహాప్రాకారం, రూ. 23 లక్షలతో రథశాల నిర్మాణ పనులకు స్వామీజీ అక్కడ శిలాఫలకం ఆవిష్కరించడంతో భక్తులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఆలయంలో కొలువైవున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని, స్వామీజీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. పరిపూర్ణ మానవ జీవితానికి భగవంతుని ఆరాధన అత్యంత అవసరమన్నారు. అత్యంత ప్రాచీనమైన ప్రాంతాల్లో వెలసిన దేవాలయాలను కాపాడుకోవడం, సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు కంకణబద్ధులు కావడం అందరూ కర్తవ్యంగా భావించాలన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ, విజయయాత్రలో భాగంగా శ్రీ స్వామీజీ మన జిల్లాలో పర్యటించడం మనందరి అదృష్టమన్నారు. స్వామీజీ దివ్య ఆశీస్సులతో జిల్లాలో గత రెండు రోజులుగా సోమశిల, పెంచలకోన, బిట్రగుంట క్షేత్రాల్లో అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు భగవత్ సంకల్పంతో సన్మార్గంలో పయనించాలని మంత్రి సూచించారు.

# మధుమేహంపై కవితాస్త్రం... 'రక్తఘోష'

మధుమేహం అనే చక్కెర వ్యాధి చెప్పలేనంత చేదువ్యాధి. పగవాడికి కూడా రాకూడదనుకొనే దీర్ఘ రోగం. మనిషిని నిరుపేదను చేసి అచేతనంగా మార్చి నిట్టనిలువునా కట్టెలాగా చుట్టేసి, సప్తసముద్రాల అవతల నిర్ధాక్షిణ్యంగా విసిరిపారేసే భయంకరమైన వ్యాధి.

ఆ వ్యాధిపై పెద్దగా కవితలు రాలేదు. ఆ వ్యాధిని వస్తువుగా తీసుకొని తొలిసారిగా ఆ రోగ లక్షణాల భయకంపిత ధోరణిని ఎండగడ్తూ 'అయ్యో పాపం చక్కెర వ్యాధి గ్రస్తులా' అనే విధంగా 'రక్తఘోష' అనే దీర్ఘరోగ కవితను చిత్రించిన వ్యక్తి అనూరాధ రామకృష్ణ. ఈ వ్యాధిపై సమగ్రంగా విశ్లేషించి, వ్యాధిగ్రస్తుల భయంకరనాదాల్ని వాదాల్ని విన్పించిన ఆమె అభినందనీయురాలు. ఒక విధంగా చెప్పాలంటే చక్కెర వ్యాధి అన్ని రోగాలకంటే భయానకమైనదిగా వర్ణించిన తీరు అద్భుతం అని చెప్పాలి.




రచయిత్రి
**అనురాధ రామకృష్ణ**
వెల: రూ. 150/-
ప్రతులకు:
అనురాధ రామకృష్ణ
మనుమసిద్ధినగర్, నెల్లూరు.
సెల్: 8179771803

ఆకలితో అలమటించే వ్యక్తి ఎదుట పంచభక్ష్యపరమాన్నాలు వడ్డించి నీవు తినడానికి లేదు, తింటే మరణమే శరణ్యం అని చెప్పడం ఎంత దారుణమో, ఆ దారుణానికి వడిగట్టే ఈ వ్యాధిని సమూలంగా వేళ్ళతో సహా పెకిలించే వ్యాక్సిన్లు, మందులు రావాలి. దానికి శాస్త్రవేత్తలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విలువైన సందేశాన్ని ఇస్తూ ఆ వ్యాధిగ్రస్తుల జీవిత చిత్రీకరణకు ప్రతిరూపమే అనూరాధ రాసిన 'రక్తఘోష' కవితా సంగ్రహం.

'దేహానికి మరణం తప్పదని తెలుసు.. మధుమేహం మేనిని ఆవరించాక దినదిన మరణమే'నంటారు అనూరాధ కవయిత్రి. చితిలో కూడా మనిషిని క్రుంగదీసే మధుమేహానికి దేహమంటే ఎంత తీపో కదా! అని క్రుంగిపోతారామె. వరాలిచ్చే దేవుడు శాపమిచ్చాడని తెలిశాక, అనుభవించడం తప్ప ఏం చేయగలం అని ప్రశ్నిస్తారామె.

'తీపి జ్వరం వళ్ళంతా ప్రాకి చేదు విషాన్ని చిమ్ముతుంది' అనే ప్రారంభమే ఆ రోగ తీవ్రతను తెలియజేస్తుంది కవయిత్రి. చక్కెర వ్యాధి రోగికి ఇన్సులిన్ పేరిట సూది మందు గుచ్చుకొనే విధానాన్ని ఎంతో బాధగా చెప్తారామె. రక్తపరీక్షలు చేసేవాళ్ళను మాంత్రికులుగా అభివర్ణిస్తూ ఆకులు, ఎండురొట్టెలు తిని బ్రతుకును ఈడ్చాల్సిందేనని ఆర్తిగా చెబుతారామె. మిఠాయిల్ని, పరమాన్నాల్ని దయ్యాలుగా చూసి జడుసుకోవాలని, కొలత ఆహారంతో శరీరం శుష్కించినా తీపిజ్వరం మరింత విజృంభిస్తుందే కానీ, ఏ మాత్రం దయచూపదంటారామె. ఈ తీపి జ్వరం కాలేయాల్ని, కన్నుల్ని, అరికాళ్ళను కొంచెం కొంచెం భుజిస్తుంటే మనం భయకంపితులం కావాల్సిందేనంటారు!

తీపి జబ్బుకు వ్యాయామమే శరణ్యమని సూర్యుడుదయించినట్లు ప్రతి తీపిరోగి వ్యాయామం తప్పనిసరిగా చేయాలని ప్రభోదిస్తారు. తీపిరోగాన్ని 'చేతబడి'గా కూడా చెప్పిన కసి ఆమెది. శుభకార్యాల్లో స్వీటు ముట్టుకోవాలంటే భయపడాల్సిన అగత్యాన్ని సైతం నొక్కి చెప్తారామె. అప్పుడు 'మధుమేహు వారు' గుర్తొచ్చి వెనుకడుగు వేసే సంప్రదాయాన్ని గుండెకోతగా చెప్తారు కవయిత్రి. ధనమున్నవారి కన్నా మధుమేహం లేనివారిని చూసి అసూయ చెందాల్సిందేనని ఆమె చెప్పడంలో ఔచిత్యం నూటికి నూరుపాళ్ళు నిజం. మధుమేహాన్ని ఓ తుఫానుగా, ఓ ప్రళయంగా, ఓ రాక్షసిగా వివిధ రూపాల్లో ఆమె ఎండగట్టిన తీరు వాస్తవానికి చాలా దగ్గరగా ఉందనడం నిజం.

అయితే, మధుమేహం తన శత్రువని తెలిశాక మనిషి అప్రమత్తంగా మారి సైనికుడై, ఆహారం పట్ల ద్వేషం పెంచుకొని, నియమబద్ధంగా నడయాడే బుద్ధిమంతుడిగా మనిషి మారతాడని చెప్తారు కవయిత్రి. 'మనిషి మత్తుమందుకు బానిసైనట్లు ఇన్సులిన్‌కు బానిసైపోవాలని' హెచ్చరిస్తారామె. మొత్తానికి ఈ చిరుకవితా పుస్తకంలో మధుమేహాన్ని చక్కగా వివరించారు. ప్రతి మధుమేహ రోగి చదివి తీరవలసిన పుస్తకం ఇది.

అన్ని మధుమేహ సంబంధిత హాస్పిటల్స్‌లోను, మధుమేహులుండే ప్రాంతాల్లోనూ ఈ పుస్తకాన్ని దొరికే విధంగా మార్కెటింగ్ చేస్తే రచయిత్రికి ఇబ్బడిముబ్బడిగా కాసులపంట పండుతుంది. ఈ వ్యాధి వారికి కొంచెం ఉపశమనం లభిస్తుంది ఈ పుస్తక పఠనం ద్వారా! దానికి తగినంత కృషి చేయాలని అనూరాధమ్మను కోరుతున్నాను.



**చిన్ని నారాయణరావు**
9440202942




# సోమిరెడ్డిని కలసిన సన్నపురెడ్డి

ఏపీఎస్ఆర్టీసీ రీజినల్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన బీజేపీ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఇటీవల సర్వేపల్లి శాసనసభ్యులు.. మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అల్లీపురంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డికి సోమిరెడ్డి అభినందనలు తెలిపి శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి తనయుడు రాజగోపాల్‌రెడ్డి కూడా ఉన్నారు.

## ఉదయగిరి సమస్యలపై...

# అసెంబ్లీలో గళమెత్తిన కాకర్ల



మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలోని అనేక సమస్యలపై ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఈనెల 16న అసెంబ్లీలో తన గళం వినిపించారు. బడ్జెట్ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా ఉదయగిరి ప్రాంతం వివక్షకు గురైందని, వెనకబడిన తమ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని కోరారు. సోమశిల ఉత్తర కాలువ పనులు వేగవంతం చేయాలని, గండిపాలెం రిజర్వాయర్‌ను అభివృద్ధి చేయాలని, వింజమూరుకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ అవసరమని.. నీటిపారుదల శాఖ మంత్రి వీటిపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు.

### హాస్టళ్ళ మరమ్మతులకు నిధులివ్వండి

ఇటీవల కురిసిన వర్షాలకు హాస్టళ్ళు ఉరుస్తున్నాయని, భవనం పైకప్పుల పెచ్చులూడిపోతున్నాయని కాకర్ల, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయులు దృష్టికి తీసుకువచ్చారు. అవసరమైనచోట్ల వెంటనే కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. వాటర్ ప్లాంట్‌లనుకూడా ఏర్పాటు చేయాలని ఆయన విన్నవించారు.

### ఉపాధ్యాయులకు సముచిత స్థానం - విద్యామంత్రి లోకేష్ హామీ

బడ్జెట్ సమావేశాలలో భాగంగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం వహించి, కక్షపూరిత ధోరణిలో వ్యవహరించిందని, జీవో 117ను తీసుకుని వచ్చి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికితేగా, అందుకు స్పందించిన లోకేష్, గత ప్రభుత్వంపై వ్యతిరేక గళాన్ని వినిపించి, వారి హక్కుల కోసం పోరాడి, ప్రభుత్వ మార్పునకు నాంది పలికింది ఉపాధ్యాయులేనని, వారికి తమ ప్రభుత్వం సముచితస్థానం కల్పిస్తుందని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి జీవో 117కు ప్రత్యామ్నాయం తీసుకొస్తామని తెలిపారు.

# కాటంరెడ్డి సుశీలమ్మ కన్నుమూత



నెల్లూరు సమీపంలోని కలివెలపాళెం గ్రామ వాస్తవ్యురాలు, దివంగత ఇంజనీర్ లచ్చారెడ్డి ధర్మపత్ని.. కాటంరెడ్డి సుశీలమ్మ ఇటీవల పరమపదించారు. ఆమె వయస్సు 95 సంవత్సరాలు. ఇంజనీర్ లచ్చారెడ్డి అంటే నెల్లూరులోని పాతతరం వారికి సుపరిచితులే. ఉన్నత విద్యావంతుల కుటుంబంగా వారికి పేరు. ఇంజనీరింగ్ చదవడమంటేనే గగనకుసుమంగా ఉన్న ఆరోజుల్లో, 1935 ప్రాంతాల్లోనే లచ్చారెడ్డి కష్టపడి చదువుకుని ఇంజనీరింగ్ పాసయ్యారు. అంతేకాదు, జిల్లాలో తొలి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్‌గా కూడా ప్రఖ్యాతిని తెచ్చుకున్నారు. వృత్తిరీత్యా పీడబ్ల్యుడిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయ్యాక, నెల్లూరులో కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత నాగార్జునసాగర్‌కి వెళ్ళి అక్కడ పనిచేస్తూ, 39 ఏళ్ళ చిన్నవయసులోనే అనారోగ్యంతో కన్నుమూశారు. వీరికి ముగ్గురు కుమారులు. ముగ్గురూ ఉన్నత విద్యావంతులే. పెద్దకుమారుడు శివప్రసాద్ అమెరికాలో స్థిరపడగా, రెండో కుమారుడు కృష్ణప్రసాద్ హైదరాబాద్‌లో కాంట్రాక్ట్ రంగంలో ఉన్నారు. మూడవ తనయుడు ఆనంద్‌కుమార్ ధార్మిక సేవాభిలాషి. చెన్నైలో ఉంటూ, ఇటీవల దాకా తిరుమల తిరుపతి దేవస్థానాల సలహామండలి అధ్యక్షులుగా కూడా శ్రద్ధాభక్తులతో బాధ్యతలు నిర్వర్తించారు. వీరి కుటుంబం నెల్లూరును విడిచి వెళ్ళినా, ఎందరో బంధువులు, ఆత్మీయులు నెల్లూరులో ఉన్నారు. ఏదేమైనా... ఎన్ని కష్టాలెదురైనా, చెదరని చిరునవ్వుతో ముగ్గురు బిడ్డలను పెంచి పెద్దచేసి ఉన్నతస్థాయికి చేర్చి, పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ధన్యజీవి సుశీలమ్మ. ఆ పుణ్యమూర్తి ఆత్మకు సద్గతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, మాతృమూర్తి మరణంతో ఆవేదనలో ఉన్న ఆ ముగ్గురు కుమారులకు, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలుపుతోంది..'లాయర్'!...

# చెత్తపన్ను రద్దు సవరణ బిల్లుకు..అసెంబ్లీ గ్రీన్‌సిగ్నల్



గత ప్రభుత్వం చెత్త సేకరించడానికి విధించిన పన్నును రద్దు చేసేందుకు కూటమి ప్రభుత్వం సవరణ బిల్లును ప్రతిపాదించింది. దానిని అసెంబ్లీ ఈనెల 21న ఆమోదించింది. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ, గత ప్రభుత్వం చెత్త పన్ను విధించి, సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా వాహనాలు ఏర్పాటు చేసి 40 మున్సిపాలిటీల్లో పన్నులు వసూలు చేసిందని, చెత్తను సేకరించడానికి నెలకి 51,641 నుంచి 62,964 రూపాయల వరకూ చెల్లించేదని తెలిపారు. 40 మున్సిపాలిటీలలో నెలకి 13.9 కోట్లకి కాంట్రాక్ట్‌లు ఇచ్చి, 2021 నవంబర్ నుంచి చెత్తపన్ను వసూలు చేయడం ప్రారంభించారని, నెలకి ఇళ్ల వద్ద 30 రూపాయల నుంచి 120 రూపాయల వరకు సేకరించారని, వాణిజ్య సముదాయాలకు నెలకు 100 నుంచి 10,000 వరకు వసూలు చేశారని వివరించారు. ఆస్తి పన్ను 50 రూపాయలు ఉన్న వారికి కూడా చెత్త పన్ను సంవత్సరానికి 356 రూపాయలు వేశారని, 2021 నవంబర్ నుంచి జూలై వరకు రూ. 325 కోట్లు బిల్లు అయితే రూ. 249 కోట్లు చెల్లించారని ఆయన తెలియజేశారు. గత ప్రభుత్వంలో చెత్తపన్ను వసూలు, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా చేసిన వ్యవహారంపై విచారణ జరిపిస్తామని కూడా మంత్రి నారాయణ ఈ సందర్భంగా ప్రకటించారు.

# పన్నులు సకాలంలో చెల్లించండి

**మంత్రి నారాయణ**



నెల్లూరు నగర పౌరులు సకాలంలో పన్నులు చెల్లించి నెల్లూరును స్మార్ట్‌సిటీ చేసేందుకు సహకరించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ అధికారులతో ఆయన ఇటీవల సమీక్ష సమావేశం నిర్వహించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నులు వసూలుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థలు మనుగడ సాధించాలంటే కార్పొరేషన్‌లో, మునిసిపాలిటీలలో ప్రజలు తప్పనిసరిగా టాక్స్ కట్టాలన్నారు. ప్రాపర్టీ టాక్స్ ఏడాదికి 71 కోట్లు వస్తుందని, అధికారులు స్పెషల్ డ్రైవ్ చేస్తే 100 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇప్పటికే 93 కోట్ల రూపాయల పాత బకాయిలు, ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాల్సి ఉందని, అభివృద్ధి పనులు త్వరితగతిన జరగాలంటే ప్రజలు తప్పనిసరిగా పన్నులు చెల్లించాలని తెలిపారు.

## అయ్యప్పగుడిలో మండల పూజలు

నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్ప గుడిలో మండల పూజోత్సవాలు ఈనెల 16న ప్రారంభమయ్యాయి. కేరళకు చెందిన వడకేడత్తు పెరుంబడప్ప మనకేశవన్ నంబూద్రిపాద్ ఆధ్వర్యంలో స్వామికి విశేషపూజలు నిర్వహిస్తున్నారు. 41 రోజుల పాటు ఈ పూజలు జరుగుతాయి. అయ్యప్ప సేవాసమాజం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# ప్రశాంతమ్మను కలిసిన విష్ణుప్రియ

## బాధ్యతలు చేపట్టిన 'ఏకలవ్య పాఠశాల' కొత్త ప్రిన్సిపాల్



కొడవలూరు మండలం చంద్రశేఖరపురంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలకు కొత్త ప్రిన్సిపాల్ వచ్చారు. ఆ పాఠశాల నిర్వహణ సరిగా లేకపోవడం, విద్యార్థులు అస్వస్థతకు గురికావడం వంటి సంచలన సంఘటనలతో ప్రిన్సిపాల్ విష్ణుప్రతాప్ శుక్లాను ప్రభుత్వం సరెండర్ చేయడం తెలిసిందే. ఆ స్థానంలో శ్రీకాళహస్తి ఏకలవ్య పాఠశాలలో జూనియర్ లెక్చరర్‌గా ఉన్న విష్ణుప్రియను నియమించారు. దీంతో, ఆమె ఆమేరకు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# ఉదయగిరికి డయాలసిస్ సెంటర్ కావాలి

**అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే కాకర్ల**

మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్య అధికంగా ఉందని, దీంతో డయాలసిస్ పేషెంట్లు కూడా ఎక్కువగా ఉన్నారని, అందువల్ల అక్కడ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. ఈనెల 18న ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ, వైద్యపరంగా తగు వసతులు లేక ఇబ్బందులు పడుతున్న తమ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ప్రత్యేకించి అత్యవసర చికిత్సలు అందుబాటులో లేకపోవడంతో, కనీసం 100 కిలోమీటర్ల పైగా దూరం వెళ్ళాల్సివస్తోందని, ఆ సమస్యలను నివారిస్తూ మెట్ట ప్రాంత వాసులకు అత్యవసర చికిత్సలు ప్రభుత్వ వైద్యశాలలో జరిగేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం తెలిపినందుకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఆయన ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వింజమూరు వైద్యశాలను వంద పడకలకు పెంచాలని కోరారు.



లాయర్
నవంబర్ 22, 2024

# రహదారులు కాదు.. మృత్యుదారులు!

అతివేగం కావచ్చు, నిర్లక్ష్యం కావచ్చు, కాలం కలసి రాకపోవచ్చు.. ఇతరత్రా కారణాలేమైనా ఉండొచ్చు.. మన దేశంలో ఏటా రోడ్డుప్రమాదాలకు లక్షలాదిమంది బలైపోతూ ఉండడం దారుణం!.. ఆధునిక విజ్ఞానం అందివచ్చినా, వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించే వ్యవస్థలెన్నో ఉన్నా.. రోడ్డు ప్రమాదాలు తరగడం లేదు కదా.. మరింతగా పెరిగి పోతూనే ఉండడం ఆందోళనకరం. విశాలమైన రోడ్లు, అడుగడుగునా హెచ్చరికలు, దూకుడువాహనాలపై కఠినచర్యలతో ఇతర దేశాల్లో రోడ్ల మీద ప్రయాణం సులభంగా, ప్రమాద రహితంగా ఉన్నా, మన దేశంలో మాత్రం ఇంకా ప్రమాదాలకు అంతు లేకుండా ఉంది. వాహనాలు నడిపేటప్పుడు అజాగ్రత్తగా ఉండకూడదని, అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం ఏమరుపాటు ఉన్నా ఘోరాలు జరిగిపోతాయని, భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిం చాలని ప్రభుత్వాలు మొత్తుకుంటూనే ఉన్నా, వాటిని అనేకమంది అలక్ష్యం చేస్తుండడంతో ప్రమాదాలు నిత్యం జరిగిపోతూనే ఉన్నాయి. దీంతో, ఇంటివద్ద నుంచి బయటకువెళ్తే, ఇక తిరిగి వస్తామన్న గ్యారంటీ ఉండడం లేదు.

జాతీయ రహదారులు, ప్రాంతీయ రోడ్లు అన్నిటినీ లెక్కవేస్తే, మనదేశంలో సుమారు 63 లక్షల కిలోమీటర్ల పొడవున్న రహదారులున్నట్లు అంచనా. పెద్దఎత్తున సరుకుల రవాణా, కోట్లాదిమంది ప్రయాణీకుల వాహనాల ప్రయాణం అంతా నిరంతరం ఈ రోడ్లమీదనే జరుగుతూ ఉంటుంది. వేగం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. 2021లో 4,12,432 ప్రమాదాలు జరిగితే, 1,53,972 మంది మరణించారని, మరో 3,84,488 మంది గాయాల పాలయ్యారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అదేవిధంగా 2022లో దేశంలో 4,61,312 రోడ్డు ప్రమాదాలు జరిగి, 1,68,312 మంది ప్రాణాలు కోల్పోయారని, మరో 4,43,366 మంది బాధితులయ్యారని పేర్కొంటున్నాయి. అంతేకాదు, గత సంవత్సరం జరిగిన రోడ్డు ప్రమాదాలపై కేంద్ర రోడ్డు రవాణాశాఖ తాజా నివేదికలో దేశంలో ప్రమాదాలు ఎంతగా పెరుగుతున్నాయో లెక్కకట్టింది. ఒక గంట..(60 నిమిషాలు) గడిచేటప్పటికే, కనీసం 20మంది రోడ్డుప్రమాదాల్లో మృత్యువాతపడుతున్నారంటూ ఆ నివేదిక పేర్కొంది. 2023లో దేశవ్యాప్తంగా మొత్తం 4,80,583 రోడ్డుప్రమాదాలు జరిగినట్లు తేల్చింది. ఆ ప్రమాద ఘటనల్లో 1,72,890 మంది ప్రాణాలు కోల్పోయారని, 4,62,825 మంది గాయపడ్డారని, 2022తో పోలిస్తే రోడ్డు ప్రమాదాల సంఖ్య 4.2 శాతం, మృతుల సంఖ్య 2.6 శాతం, బాధితులు 4.4 శాతం పెరగడం ఆవేదన కలిగించే విషయమని పేర్కొంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు ఢిల్లీలోనూ ఇటీవలికాలంలో ప్రమాదాలు బాగా పెరిగాయని నివేదిక తేల్చిచెప్పింది. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా తమిళనాడులో జరుగుతున్నాయని, గత ఏడాది అక్కడ 67,213 ప్రమాదాలు జరిగాయని నివేదికలో తెలిపారు. ప్రమాదాల బారినపడుతున్నవారిలో ఎక్కువగా ద్విచక్రవాహనదారులే ఉంటున్నారని, మరణించినవారిలో దాదాపు సగం మంది వారేనని వివరించారు.

అతివేగం అనర్థదాయకమని, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం.. ప్రాణాలకే ముప్పు తెస్తుందని వాహనదారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. అంతేకాదు, మద్యం తాగి వాహనాలు నడపడం, మాదకద్రవ్యాలు వాడడం, ఫోన్‌లో మాట్లాడుకుంటూ డ్రైవ్ చేయడం, ట్రాఫిక్ నియమనిబంధనలు అసలు పట్టించుకోకపోవడం, ప్రాణాలకు రక్షణ కలిగించే హెల్మెట్, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, రాత్రి వేళల్లో రహదారుల పక్కన వాహనాలు ఆపడం వంటి నిర్లక్ష్యాల వల్ల ప్రమాదాలు మరింతగా పెరుగుతున్నాయి. మరోవైపు వాహనాలు నడపడంలో అనుభవం లేనివారు డ్రైవింగ్ చేయడం, యువత స్పీడ్ డ్రైవింగ్‌కు అలవాటుపడడం, దూరప్రయాణాలు చేస్తూ నిద్ర లేకపోవడం వంటి అనేక కారణాలు రోడ్డు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. దాంతోపాటు అనేక రహదారులు గుంటలు మిట్టలతో ఎగుడుదిగుడుగా ఉండడం, గుంటలు పూడ్చకుండా ఆయా ప్రాంతాల్లోని అధికారగణం నిర్లక్ష్యం వహించడం వంటివి కూడా ప్రమాదాలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇకనైనా, అటు ప్రభుత్వాలు, ఇటు ప్రజలు, వాహనదారులు రహదారి భద్రతకు, సురక్షిత ప్రయాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. మన వాహనమే కాక, అవతలి వాహనంలో ఉన్నవారు కూడా భద్రంగా ఉండేలా చూసుకోవాలి. ప్రమాదాలు జరిగి జీవితాంతం బాధపడేకంటే, ప్రమాదాలు లేని ప్రయాణాలే ధ్యేయంగా ముందుకు సాగాలి. అప్పుడే కొంతమేరకైనా రోడ్డుప్రమాదాలను నివారించగలం!..

# దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది!

గత వారం మన 'లాయర్'లో మొండివాడు జగమొండిగా మారి జగడం పెట్టుకుంటున్నాడని జగన్‌మోహన్‌రెడ్డి గురించి బాగా విశ్లేషించారు. రాజశేఖరరెడ్డి గారి తనయుడు, యువకుడు, ప్రతిభావంతుడు ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఉద్ధరిస్తాడు అన్న ఆశతో ప్రజలు ఆయనకి అధికారం కట్టబెడితే... రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడు. క్యాంపు కార్యాలయ రాజకీయాలతో కంపు పట్టిపోయాడు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, కేసులు, అరెస్టుల గురించి ఆయనా, ఆయన ముఠా మాట్లాడుతున్నారు. ప్రతిపక్షహోదా ఇవ్వాల్సింది ప్రజలు తప్ప న్యాయస్థానాలు కాదన్న కనీస స్పృహ కూడా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. ఇలాంటివాడికి అధికారం ఇచ్చినందుకు ఆంధ్రా ప్రజలందరం సిగ్గుపడాలి. ఒక్క అవకాశం అని ఆయనే అడిగాడు, ఒక్కసారితోనే ఇంటికి పోయాడు!

– గయాజుద్దీన్ అహ్మద్, ఉదయగిరి.

# రాయితీలు ముద్దు... ఉచితాలు వద్దు!

ఆర్.టీ.సీ బస్సుల్లో ప్రయాణించే 60 సంవత్సరాలు దాటిన ప్రయాణికులకు చంద్రబాబునాయుడి గారి నాయకత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, టిక్కెట్టు ధరలో 25 శాతం రాయితీ ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సీనియర్ సిటిజన్లకు రైల్వేశాఖ కల్పిస్తున్న మినహాయింపు తరహాలో ఏపీ ప్రభుత్వం కూడా బస్సులలో శ్రీకారం చుట్టింది. అర్హత ఉన్నవారికి రాయితీలు ఇవ్వడం అన్నది మంచి సంప్రదాయం. అలా కాకుండా ఓట్లు దండుకోవడం కోసం నోట్లు ఎరచూపే క్రమంలో ఇష్టానుసారం ఉచిత తాయిలాలని ప్రకటించి అందించడం క్షమించరాని తప్పు. అది ఎవరుచేసినా క్షమార్హం కాదు. ఇప్పటికే నష్టాల బాటలో నడుస్తున్న ఆర్.టీ.సీ బస్సులలో మహిళలందరికి ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాల్సిన అవసరం లేదు. అలా ఇవ్వదల్చుకుంటే నిజంగా అర్హత కలిగిన మహిళలను గుర్తించి, వారికి మాత్రమే అందించడం సముచితం. మహిళలకి ఉచిత ప్రయాణం కల్పించే విషయంలో ప్రభుత్వ పెద్దలు పునరాలోచన చేయాలని నా విన్నపం!

పీ. అనూరాధ, నెల్లూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## నటి కస్తూరి అరెస్టు..
## సినిమా వాళ్ళకి ఓ గుణపాఠం!

తమిళనాట నివసించే తెలుగువారి పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రముఖ సినీ నటి కస్తూరిని పోలీసులు అరెస్టుచేసి తగిన బుద్ధి చెప్పారు. తాను తొందరపాటుతో తప్పుగా మాట్లాడానని, తనను క్షమించమని ఆమె వేడుకున్నా చట్టం, న్యాయం ఆమెని వదిలి పెట్టలేదు. రాజకీయాలలోకి వచ్చి, సంచలనం కోసం నోటికి ఏదొస్తే అది మాట్లాడుతున్న సినిమావాళ్ళకి నటి కస్తూరి అరెస్టు ఒక గుణపాఠం లాంటిది. తెరమీద డైలాగులు చెప్పినట్లుగా ప్రజా క్షేత్రంలో నోటికి ఏదొస్తే అది మాట్లాడితే చెల్లదని, సినిమా రంగం నుండి రాజకీయాలలోకి వచ్చే నటీనటులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని రాజకీయ విమర్శలు చేసేముందు ఒళ్ళు దగ్గర పెట్టుకోకపోతే తిప్పలు తప్పవని కస్తూరి ఉదంతం ద్వారా అర్థం చేసుకుంటే మంచిది.

డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, చెన్నై.

సత్యపీఠం
నిజాలే మాట్లాడుకుందాం! 65

## చిన్నారుల జీవితాలని
# ఛిద్రం చేస్తున్న అంతర్జాల ఆటలు!

నేటి ఆధునిక యుగంలో యావత్ ప్రపంచం క్షణాల్లో అరచేతిలో కనిపిస్తోంది. మునిచేతి వేళ్ళతో ముల్లోకాలని సెల్‌ఫోన్‌లలో దర్శించుకునే సౌలభ్యం అందుబాటులోకి వచ్చేసింది. చిన్నా, పెద్దా అన్న తేడా లేకుండా రెండు సంవత్సరాల పసిబిడ్డ నుండి 90 యేళ్ళ పండు ముసలి వరకూ అందరి చేతులలోనూ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లు మాయా దర్పణాలుగా దర్శనమిస్తున్నాయి.

ఒకప్పుడు కేవలం సమాచారం కోసం మాత్రమే వినియోగించబడే ఫోన్లు ఇప్పుడు సెల్‌ఫోన్లుగా అవతరించి సమాజంలో విధ్వంసం సృష్టిస్తున్నాయి.

పాతరోజుల్లో చాంతాళ్ళంత వైర్లతో ఇళ్ళల్లో, ఆఫీసుల్లో కేవలం టేబుళ్లకే పరిమితమైన ఫోన్లు, ఇప్పుడు బెత్తెడంత సైజుకి మారి కవచకుండలాలలా మనిషి జీవితంలో భాగమైపోయాయి. ముఖ్యంగా ఈ ఫోన్లు, ట్యాబ్‌ల ప్రభావం చిన్నపిల్లలపైన ఎక్కువగా పడుతోంది. పసి ప్రాయంలోనే వాళ్ళు ఈ గ్యాడ్జెట్ల మాయలో పడి చెడిపోతున్నారు.

స్మార్ట్‌ఫోన్‌లలో కుప్పలుతెప్పలుగా వస్తున్న ఆన్‌లైన్ ఆటలు చిన్నపిల్లల భవితను అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. ఒక్క చిన్నపిల్లలనే కాదు.. యువతను, పెద్దలను-వృద్ధులను కూడా ఇవి బాగా ఆకట్టుకుంటూ వాటికి బానిసలుగా మార్చేస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, సమాజాన్ని పెడదారి పట్టిస్తున్నాయి. ఆన్‌లైన్ గేమ్స్ ఆడడం అన్నది నేటి తరానికి ఒక పెద్ద వ్యసనంగా తయారైందనడానికి సందేహమే అక్కరలేదు. అంతర్జాల ఆటల మాయలో పడిపోయి అదే పనిగా వాటిని చూడటం లేదా ఆడటం అన్నది అందరికీ సర్వసాధారణమైపోయింది.

కాలక్షేపం కోసం, లేదా మానసిక ప్రశాంతత కోసం అటు పిల్లలు, ఇటు పెద్దలు కూడా ఆన్‌లైన్ ఆటల పట్ల ఆకర్షితులవుతున్నారు. పది నుండి పద్నాలుగేళ్ళ లోపు పిల్లలలో అయితే ఆన్‌లైన్ గేమ్స్ ఆడాలన్న కోరిక మరింత బలంగా కనపడుతోంది. ఫోన్ కనిపిస్తే చాలు, వెంటనే వాటిలోకి వెళ్ళిపోతున్నారు. పసిపిల్లలైతే ఫోన్ ఇవ్వకుంటే ఏడవడం మొదలుపెడుతున్నారు. అలిగి అటకెక్కుతున్నారు. అందమైన రంగుల స్క్రీన్‌లు, ఉత్సాహభరితమైన ఆటలు లెక్కలేనన్ని అందుబాటులోకి రావడంతో, వాటి మాయాజాలంలో పడనివారుండడం లేదు. ఫోన్‌లో వీడియోగేమ్స్ చూపిస్తే తప్ప చిన్నారులు నోట్లో అన్నం ముద్ద కూడా పెట్టించుకోవడంలేదు. ఇది ఏ ఒక్క ప్రాంతంలోనో కాదు, ప్రపంచమంతా ఇదే దుస్థితి ఉంది. ముఖ్యంగా బంగారు భవిష్యత్తు ఉన్న బాలలు, ఈ ఆన్‌లైన్ గేమ్‌ల మాయలోపడి, తమ విలువైన బాల్యాన్ని, గంటల తరబడి కాలాన్ని, స్వతహాగా ఆలోచించే జ్ఞానాన్ని కోల్పోతున్నారు. అనేక జాతీయ అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

### చదువుకు దూరంగా..వికృత ప్రవృత్తికి దగ్గరగా :

స్మార్ట్‌ఫోన్‌లను సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనకరం. కానీ, ఎక్కువ శాతం మంది తెలిసో తెలియకో, పలు రకాల ఆకర్షణలకు గురై, వ్యక్తిగత బలహీనలతకు లోనై వాటిని దుర్వినియోగం చేసుకుంటున్నారు. చిన్నపిల్లలు చదువుకు దూరమైపోతున్నారు. తమ పెద్దలు, కుటుంబసభ్యుల మాట పెడచెవిన పెడుతూ అదేపనిగా ఆన్‌లైన్ గేమ్స్‌తోనే రోజంతా గడిపేస్తున్నారు. వాటిలో హింసను ప్రేరేపించేవి, విధ్వంసకర ప్రవృత్తిని చేరువ చేసేవి కూడా ఎన్నో ఉంటున్నాయి. అభంశుభం తెలియని ఎంతో మంది పిల్లలు వాటినే ఇష్టపడుతున్నారు. నిద్రమంచం లేచినప్పటి నుండీ కూర్చున్నా, లేచినా, పడుకున్నా ఫోన్‌లను చూస్తూనే ఉండడమే పని. ఈ అలవాటు అటు కంటికి, ఇటు వంటికి రెంటికీ మంచిదికాదు. ఈ సంస్కృతి అత్యంత ప్రమాదకరమని ఎంతగా చెప్పినా ఎవరూ వినిపించుకోవడం లేదని మానసిక వైద్యులు వాపోతున్నారు. విద్యార్థుల్లో ఈ వ్యసనం మరింతగా పెరిగిపోతోంది. గత కొన్నేళ్లుగా పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్‌కి బాగా అలవాటుపడిపోయారు. ముఖ్యంగా నాలుగేళ్ళ క్రితం వచ్చిన కోవిడ్ మానవ జీవితాలాలో పెనుమార్పు తెచ్చింది. అందులో ప్రధానమైనది అంతర్జాల వినియోగం. ముఖ్యంగా ఆన్‌లైన్ క్లాసుల పేరుతో ప్రాథమిక పాఠశాలలు సైతం తమ విద్యార్థినీ విద్యార్థుల చేతికి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ఐ పాడ్ వంటి పరికరాలని అందించడంతో అది సమాజ నాశనానికి నాంది పలికింది. చదువుకోవడం మానేసి మొండిగా తయారవుతున్నారు. బెట్టింగ్‌లు, జూదం వంటి తదితర చెడుమార్గాల పట్ల ఆకర్షితులవుతున్నారు. సమాజంలో ఇదో వికృతమైన ప్రమాదకర జాడ్యంగా తయారైంది.

### కట్టడి చేయకుంటే.. కష్టాలు తప్పవు

మనదేశంలో స్మార్ట్‌ఫోన్‌లు వాడుతున్న వారిలో అత్యధికంగా... అంటే దాదాపు 65 శాతం మంది ఆన్‌లైన్ ఆటలతోనే కాలం గడుపుతున్నారని తాజా అధ్యయనాల్లో తేలింది. ఇతర దేశాల్లో కూడా, ఎక్కడైతే ఆన్‌లైన్ గేమ్స్‌కి పిల్లలు అలవాటుపడుతున్నారో అక్కడంతా చదువులో వారు వెనుకబడుతున్నారు. పుస్తకాలు చదువుకుంటూ, బుద్ధిగా బడికిపోతున్న పిల్లలు మాత్రం విద్యలో బాగా రాణిస్తున్నారు. పిల్లల మనసుల మీద ఆన్‌లైన్ ఆటలు గాఢమైన ప్రభావం చూపుతుండడంతో, చాలామంది మానసికంగా వాటికి బానిసలై, చిన్నతనం నుంచే గాడి తప్పుతున్నారు. కొన్నిరకాల ఆన్‌లైన్ ఆటలు చివరికి ప్రాణాల మీదకి కూడా తెస్తున్నాయని, వాటిని తక్షణమే కట్టడిచేయకుంటే తీవ్ర దుష్పరిణామాలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందుగా తల్లితండ్రులు మేల్కోవాలి. తాము వాటిని చూడడం ఆడడం మానేయాలి. పిల్లలు వాటికి దూరంగా ఉండేలా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ఫోన్‌లలో అవి కనిపించకుండా మార్పులు చేసుకోవాలి. పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ వారిని మంచిదారిలో పెట్టాలి. ఉపాధ్యాయులు తమవంతు బాధ్యతగా ఉంటూ, ఇలాంటి ఆన్‌లైన్ గేమ్స్‌కు, చెడు వ్యసనాలకు విద్యార్థులు లోనుకాకుండా చూసుకోవాలి. ప్రభుత్వాలు కూడా వీటిపై దృష్టి సారించి, పిల్లల భవితను అంధకారమయం చేస్తున్న అభ్యంతరకరమైన ఆన్‌లైన్ ఆటలని పూర్తిస్థాయిలో నిషేధించాలి. లేకుంటే ఇదో పెద్ద విషవృక్షంగా మారి, ఎవరూ బాగుచేయలేనంత స్థాయిలో సమాజాన్ని చెడుదోవ పట్టిస్తుంది. చిన్నతనం నుంచి పిల్లలకు ఇంట్లోనూ, బడిలోనూ నైతికవిద్యతో పాటు మంచితనం, మానవత్వం, స్నేహభావం, సేవాభావం వంటివాటిని బోధించాలి. సమాజ పరిజ్ఞానంతో పాటు, దైవభక్తిని, దేశభక్తిని ప్రోత్సహించి పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలి. ఇందులో తల్లితండ్రులు, గురువులదే గురుతర బాధ్యత. ఆ బాధ్యతను ఏమాత్రం విస్మ రించినా మనపిల్లలు, మన కుటుంబమే కాదు, చివరికి మొత్తంగా సమా జమే అధోగతి పాలవుతుంది. చిన్నారుల జీవితాలు ఛిద్రమైపోతాయి. తస్మాత్ జాగ్రత్త!

- రాజశ్రీ

# 'ఏకలవ్య' విద్యార్థులకు అస్వస్థత

## ➢ హుటాహుటిన వెళ్లి పరామర్శించిన ప్రశాంతమ్మ



కొడవలూరు మండలం చంద్రశేఖర పురంలోని ఏకలవ్య పాఠశాలలో అనేక మంది విద్యార్థులు సోమవారం రాత్రి అన్నం తిన్న తర్వాత వాంతులు విరోచనాలతో అస్వస్థతకు గురికావడం విద్యార్థి వర్గాల్లో కలవరం రేకెత్తించింది. మొత్తం 428 మంది విద్యార్థుల్లో 32 మంది తీవ్ర అనారోగ్యం పాలుకావడం పెద్ద దుమారం రేపింది. ఆ సమాచారం తెలిసిన వెంటనే రాత్రి 10 గంటల సమయంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హుటాహుటిన పాఠశాలకు వెళ్ళి పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఆ ఘటనకు కారణమైన ప్రిన్సిపల్ తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. అందరితో మాట్లాడి సంఘటన వివరాలను ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల సిబ్బందితో చర్చించారు. అవసరమైతే చికిత్సల కోసం విద్యార్థులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. అందుకు వెంటనే అంబులెన్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ఆ ఘటనపై ప్రిన్సిపల్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రిన్సిపల్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యంకంటే ఏదీ ముఖ్యం కాదని, ప్రతిఒక్క విద్యార్థి క్షేమంగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.

### నిర్లక్ష్యపు ప్రిన్సిపాల్‌పై ప్రభుత్వం వేటు

కొడవలూరు ఏకలవ్య పాఠశాల దుస్థితిని, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర గిరిజనశాఖ మంత్రి జుయల్ ఓరమ్ దృష్టికి తీసుకువెళ్ళడంతో, ఆ పాఠశాలపై వెంటనే చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపల్ విష్ణుప్రతాప్ శుక్లాను సరెండర్ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏకలవ్య పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా శ్రీకాళహస్తి ఏకలవ్య పాఠశాల లెక్చరర్ విష్ణుప్రియను నియమిస్తూ ఆదేశాలిచ్చింది. కాగా, ఏకలవ్య పాఠశాలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గత ఆగస్టు 28వ తేదీన సందర్శించి అక్కడి ప్రాంగణంలో నిర్మించిన విద్యార్థుల భోజనశాల ప్రారంభానికి నోచుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే! అనంతరం ఆ విషయాలన్నీ వేమిరెడ్డి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖమంత్రి జుయల్ ఓరమ్ దృష్టికి తెచ్చారు. నెల్లూరు ఐటీడీఏ అధికారులు కూడా పాఠశాలను పరిశీలించి సమస్యలను త్వరితగిన పరిష్కరించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. ఇటీవల ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ కూడా పాఠశాలను పరిశీలించి సమస్యలపై ఆరా తీశారు. ఇంత జరిగినా పాఠశాల ప్రిన్సిపల్ తీరు మారకపోవడం, ఈ నేపథ్యంలో విద్యార్థులు ఆహారం కలుషితమై అస్వస్థతకు గురికావడంతో, ఆ సంఘటనలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రిన్సిపాల్‌పై తక్షణ చర్యలు తీసుకోవడం సంచలనమైంది.

# శ్రీసిటీ విజయాలు అపూర్వం!..

## దేశానికి మరో వంద శ్రీసిటీలు కావాలి - నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం



అన్ని వసతులతో కూడిన విశాల స్థలం, వ్యాపార అనుకూల వాతావరణం కలిగిన శ్రీసిటీ పారిశ్రామికవాడ లాంటివి భారతదేశానికి మరో వంద కావాలంటూ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. ఇటీవల ఆయన శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఛైర్మన్ శ్రీనిరాజు, వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రత్యేకతలను, పారిశ్రామికవృద్ధిని వివరించారు. అనంతరం జరిగిన పరిశ్రమల సీఈఓల సమావేశంలో సుబ్రమణ్యం మాట్లాడుతూ, భారతదేశం అభివృద్ధిలో వేగంగా దూసుకెళుతోన్న ఈ తరుణంలో పరిశ్రమల వృద్ధి, స్థాపనకు మన దేశం అత్యంత అనువైనదంటూ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా, యువత అందుబాటులో ఉందని, వారిని శ్రామికశక్తిగా మార్చుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీసిటీ విజయాలు అపూర్వమంటూ ప్రశంసించారు. గత కొన్నేళ్లుగా తన పర్యటనల్లో కొన్ని ప్రదేశాలు ప్రత్యేకంగా నిలిచాయని, అందులో శ్రీసిటీ ఒకటని చెప్పారు. సహజసిద్ధమైన పర్యావరణ వ్యవస్థతో 30 దేశాలకు చెందిన 220 విభిన్న పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసిటీ, భారతదేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాలలో ఒకటిగా పేర్కొన్నారు. ముఖ్యంగా ఇక్కడ నీటి సంరక్షణ పద్ధతులను కొనియాడుతూ, వరదలను నివారించేందుకు ఏర్పాటు చేసిన నీటి గుంటలు, రిజర్వాయర్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చేందుకు భారత దేశాన్ని ముందుకు నడిపించే శ్రీసిటీ వంటి ప్రాజెక్టులు చక్కని ఉదాహరణ అన్నారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, నీతి ఆయోగ్ సీఈఓ పర్యటనతో శ్రీసిటీకి ఇది ఒక ప్రత్యేకమైన రోజుగా ఉందంటూ సంతోషం వ్యక్తం చేశారు. వాణిజ్య శాఖ కార్యదర్శిగా ఉన్నప్పటి నుండి ఆయన సందర్శన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని, చివరకు ఇప్పుడు అంతకంటే పెద్ద పదవిలో ఉంటూ ఇక్కడికి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యత

జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. బుధవారం కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలో ప్రగతి యువ కేంద్రం రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా పండించిన పంటలను ఎగుమతులు చేయడానికి అవసరమైన మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తామని, ప్రభుత్వం నుండి వచ్చే రాయితీల్లో మొదట రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.







## కృతజ్ఞతాపూర్వక కలయిక

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరుణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలను కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, పక్కన కోవూరు మాజీ ఎమ్మెల్యే .. దినేష్‌రెడ్డి తండ్రి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి.

## బాధ్యతలు చేపట్టిన పోలంరెడ్డి దినేష్‌రెడ్డి




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఈనెల 20న విజయవాడలోని కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కోవూరు నియోజకవర్గ శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి.. దినేష్‌రెడ్డి చేత ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఏ.ఎం.డి.ఫరూక్, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్.. నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్, గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్, శాసనమండలి సభ్యులు రాంభూపాల్‌రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మారిటైల్ కార్పొరేషన్ ఛైర్మెన్ దామచర్ల సత్య, పొల్యూషన్ బోర్డు ఛైర్మెన్ పి.కృష్ణయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

## సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలో ఇటీవల నిర్వహించిన వైద్యశిబిరాన్ని సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొని పేద రోగులకు సేవలు అందిస్తున్న వైద్య సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదప్రజల ఆరోగ్య పరిరక్షణకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. తమ తండ్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేదవారి ఆరోగ్యంపట్ల ఎంతో శ్రద్ధచూపుతారని, ఆయన ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారని, ఈ నేపథ్యంలో త్వరలోనే ముత్తుకూరు పిహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)ని కూడా త్వరలో సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి జరుగుతుందని చెప్పారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పట్ల చొరవ తీసుకోవాలని సూచించారు. దోమలు పెరగకుండా నీటివనరులను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

# నారా రామ్మూర్తినాయుడుకు నివాళి



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మృతి బాధాకరమని, చంద్రగిరి రాజకీయాల్లో కీలకంగా ఉంటూ చంద్రబాబుకు ఆయనెంతో అండగా ఉండేవారని, ఆయన లేని లోటు తీరనిదని నెల్లూరు టీడీపీ నేతలు రామ్మూర్తినాయుడుకు ఘన నివాళులర్పించారు. ఇటీవల నెల్లూరు గోమతినగర్‌లోని మంత్రి నారాయణ క్యాంప్ కార్యాలయంలో, రామ్మూర్తినాయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర మునిసిపల్ మంత్రి నారాయణ, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మహిళా నాయకురాళ్లు తాళ్లపాక అనూరాధ, ముప్పాళ్ళ విజేత పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వరమ్మవారి దేవాలయంలో..
# అన్నదానానికి లక్ష విరాళం



నెల్లూరు దర్గామిట్ట లోని శ్రీ రాజరాజేశ్వరి దేవి అమ్మవారి ఆలయంలో అన్నదానం కోసం స్థానిక రామలింగాపురానికి చెందిన కావ్య లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈనెల 15న ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డికి అందించారు.

## గ్రంథాలయ వారోత్సవాల్లో..
# అలరించిన కవిసమ్మేళనం



నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈనెల 17న జరిగిన కవిసమ్మేళనం అందరినీ అలరించింది. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, సమాజాన్ని చైతన్యవంతం చేసేది కవిత్వమేనన్నారు. అవ్వారు శ్రీధర్‌బాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈతకోట సుబ్బారావు, పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజు సుభద్రాదేవి, మోపూరు పెంచలనరసింహం, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, ఇసనాక దయాకర్‌రెడ్డి, ఇంద్రగంటి మధుసూదన్‌రావు, ములుగు లక్ష్మీమైథిలి, హస్తి లక్ష్మణరాజు, ఎస్‌డి నజ్మా షమి, ఆమంచర్ల రేవతి, సందడి అరుణ, తోట సులోచన, వాయుగండ్ల శశికళ, హస్తి మోహన్‌రాజు, అన్నం శివకృష్ణప్రసాద్, పార్లపల్లి నాగేశ్వరి, అనూరాధా రామకృష్ణ, బొగ్గవరపు శ్రీమన్నారాయణ పాల్గొని కవితాపఠనం చేశారు. అనంతరం కవులు-కవయిత్రులందరినీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

# నెల్లూరు కబుర్లు

# ఆర్టీసీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

### - సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



ఆర్టీసీ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని, మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ఆర్టీసీని ప్రగతి పథంలో నడిపిస్తానని ఇటీవల ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మెన్‌గా నియమితులైన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి చెప్పారు. ఈనెల 19న ఆయన నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆర్టీసీలో ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని, కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు వంశీధర్‌రెడ్డి, మధు, రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, బీజేపీ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాసులు, నాయకులు మిడతల రమేష్, విజయకుమార్, చిలకా ప్రవీణ్, మొగరాల సురేష్, మండ్ల ఈశ్వరయ్య తదితరులు పాల్గొని సన్నపురెడ్డికి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

# డా.కిషోర్స్ రత్నం విద్యార్థుల సేవాభావం

### •వియాని హోమ్స్ చిన్నారులకు నిత్యావసర సరుకులు



నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం మెడికల్ ఒలంపియాడ్ హైస్కూల్ విద్యార్థులు స్థానిక వియానీ హోమ్స్‌లో ఉన్న చిన్నారులకు నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. ప్రతి ఏటా నవంబరు నెలలో నిర్వహించే కమ్యూనిటీ సర్వీస్ డేని పురస్కరించుకుని విద్యార్థులు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. బియ్యం, పప్పుధాన్యాలు, సబ్బుల, గోధుమపిండి, పంచదార, నూనె, టవల్స్ తదితర సామగ్రిని వారికి అందించి చిన్నారులకు తమవంతు చేయూతనందించారు. డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌కి, విద్యార్థులకి ఈ సందర్భంగా వియాని హోమ్స్ నిర్వాహకులు అన్నపూర్ణ, జయ తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ విద్యాసంస్థల జనరల్‌మేనేజర్ రామమూర్తినాయుడు, ఏటి తుహీన, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించకుంటే..చర్యలు తప్పవు

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో భవనాలు నిర్మించేవారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. ఈనెల 19న నగరంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి భవన నిర్మాణాలను పరిశీలించారు. లక్ష్మీపురం ప్రాంతంలో రోడ్డుపై భవన నిర్మాణసామగ్రిని పెట్టి భవనం నిర్మిస్తుండడం చూసి, ఆ భవన యజమానులకు నోటీసులు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు నడిచే దారుల్లో అంతరాయాలు కలిగిస్తే సహించేది లేదన్నారు. నిబంధనలు పాటించని భవనాలను గుర్తించి వారికి నోటీసులివ్వాలని సిబ్బందికి చెప్పారు.

# గిరిజనులకు 'ఆధార్' అందించండి

### - రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్



గిరిజనులకు జిల్లా అధికారులు ఆధార్ తదితర కార్డులు అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ సూచించారు. ఇటీవల ఆయన జిల్లా పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా నెల్లూరులో విలేకర్లతో మాట్లాడుతూ, ఈ జిల్లాలో అత్యధికంగా యానాది కుటుంబాలు ఉన్నాయని, వారికి ఇప్పటికీ ఆధార్, రేషన్, ఓటర్ ఐడి కార్డులు, జనన ధృవీకరణ పత్రాలు లేవని తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుకునేందుకు ఆ కార్డులు లేకపోవడంతో, అర్హతలు ఉండి కూడా వారికి సంక్షేమం అందడం లేదన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆధార్ కార్డులు అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకొని గిరిజనులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా జిల్లాలోని 40 శాతం మంది గిరిజనులకు జాబ్‌కార్డులు లేవన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యం తగదని, ఆయా కేసుల్లో బాధితులకు నష్టపరిహారం కూడా సత్వరమే అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, నాయకులు పెంచలయ్య, రఘు పాల్గొన్నారు.

# గొలగమూడికి పాదయాత్ర చేసిన..సాయిభక్తులు



వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో వెలసివున్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆలయాన్ని ఈనెల 17న నెల్లూరులోని సాయిదర్బార్ అద్దాలమందిరం వద్ద నుంచి సుమారు నాలుగువందల మంది సాయిభక్తులు పాదయాత్రగా వెళ్ళి దర్శించుకున్నారు. శ్రీ సాయి మాలధారణ, మండల దీక్ష -షిరిడీయాత్ర సందర్భంగా ప్రతి ఏటా చేపడుతున్నట్లుగానే ఈసారి కూడా నిర్వాహకులు ఈ యాత్ర చేపట్టారు. కోలాటాలు, పండరిభజనలతో, శ్రీ సాయి నామ సంకీర్తనలతో, 'ఓం నారాయణ-ఆదినారాయణ' నామోచ్చారణలతో పాదయాత్ర చేస్తూ గొలగమూడికి బయలుదేరివెళ్ళారు. సాయిదర్బార్ అద్దాల మందిరం ట్రస్ట్ ఛైర్మెన్ మధుసాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్ర అందరినీ ఆకట్టుకుంది. దాత పాబోలు రామసుబ్బయ్య, సాయిసేవకులు బాబీ సాయి, మందిరం కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జయప్రదంగా జరిగింది.

# మహనీయం..శ్రీకృష్ణ తత్వం!



శ్రీకృష్ణ తత్వం మహనీయమైనదని ప్రముఖ బాల సాహితీవేత్త డా. గంగిశెట్టి శివకుమార్ అన్నారు. సామాన్యునిగా జన్మించిన శ్రీకృష్ణుడు నిష్కామ కర్మ ద్వారా అసామాన్యునిగా రాణించి, దుష్టశిక్షణ-శిష్ట రక్షణలే పరమావధిగా జీవించి శ్రీకృష్ణ పరమాత్మగా అందరి పూజలందుకుంటున్నారని వివరించారు. ఈనెల 17న నెల్లూరులోని చక్రాలవారి ట్రస్ట్‌లో గోవిందరాజుల సీతాదేవి సాహితీ వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 'శ్రీకృష్ణుని జీవితం-సందేశం' అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం, నిర్వాహకులు డా.గంగిశెట్టిని ఘనంగా సన్మానించారు. కవి అవ్వారు శ్రీధరబాబు, కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, తోట సులోచన, ట్రస్ట్ మేనేజర్ చక్రాల వెంకటనరసింహులు తదితరులు పాల్గొన్నారు.






# వేడుకగా..వెండి నంది ఉత్సవం



నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఈనెల 19న చిన్న నంది ఉత్సవం వేడుకగా జరిగింది. కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రితో మన ఎంపీలు!



ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో మన నెల్లూరు, ఒంగోలు పార్లమెంటు సభ్యులు భేటీ అయ్యారు. ఇటీవల ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఈ భేటీ జరిగింది. ముఖ్యమంత్రి తన నివాసంలో టీడీపీ పార్లమెంటు సభ్యులతో ముచ్చటించారు. రాబోవు సమావేశాలలో పార్లమెంటులో వ్యవహరించవలసిన వ్యూహం పట్ల ఆయన ఎంపీలకి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, సంక్షేమ పథకాలు సాధించుకోవడం కోసం పార్లమెంటు సభ్యులు కృషి చేయాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డిలని ముఖ్యమంత్రి తన పక్కనే కూర్చోబెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. తమ పార్లమెంటుసభ్యులకి ముఖ్యమంత్రి ఇస్తున్న ప్రాధాన్యతని చూసి నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు, ఆ ఇద్దరి నాయకుల అభిమానులు సంతోషపడుతున్నారు.

# వెయ్యేళ్ళనాటి శ్రీ స్వర్ణలింగేశ్వరునికి.. పూర్వ వైభవం





నెల్లూరు చెరువు ఒడ్డున గణేష్ ఘాట్ వద్ద వెయ్యేళ్ళ క్రితం కాకతీయ మహారాజు ప్రతాపరుద్రుడు నిర్మించిన అత్యంత ప్రాచీనమైన శ్రీ స్వర్ణ లింగేశ్వరస్వామి వారి జీర్ణోద్ధరణ, మహా కుంభాభిషేక మహోత్సవాలు ఇటీవల వైభవోపేతంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు శృంగేరి దక్షిణ మ్నాయ శ్రీ శారదా పీఠం ఉత్తర పీఠాధిపతులు.. పూజ్యశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి, తుని–తపోవనం పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామి పాల్గొని, వారి చేతులమీదుగా ఈ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించడం విశేషం. ప్రత్యేకపూజలతో పాటు మహాపూర్ణాహుతి, నూతన గణేశ విగ్రహానికి ప్రతిష్ఠ, మూషిక, నంది విగ్రహాలకి బలిపీఠాలు ప్రతిష్ఠించి వారు పూజలు నిర్వహించారు. వేదపండితులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారు షోడశోప పూజలు నిర్వహించి పవిత్ర తీర్థ కుంభాజలాలను శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామికి, పరివార దేవతలు శ్రీ విఘ్నేశ్వరస్వామి వారికి, నంది–మూషిక వాహన ద్వయానికి వేద మంత్రాలతో, జయ జయ శంకర –హర హర శంకర ఉచ్చారణతో కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వర్ణభారత్ ట్రస్ట్ ట్రస్టీ దీపా వెంకట్ మాట్లాడుతూ, మండల పూజల అనంతరం ప్రతి ఒక్కరూ దివ్య క్షేత్రాలతో సమానంగా ఇక్కడ అభిషేకాలు, పూజలు నిర్వహించే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సతీమణి శ్రీమతి ఉషమ్మ, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపమ్మ–వెంకట్‌రావు దంపతులు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డెప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, సుభద్రమ్మ, హైమావతమ్మ, నాగరాజారెడ్డి, స్వరూపమ్మ, సుబ్బారాయుడు, సంగీత విద్వాంసులు శ్రావణ్, పి.సురేంద్రరెడ్డి–గీత దంపతులు, సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు పి.సత్యనాగేశ్వరరావు, సింహపురి కార్తిక దీపోత్సవ సమితి అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కె.వెన్నెల, భయ్యా మల్లిక, కోడూరు జయప్రదమ్మ, విజయ్‌కుమార్‌యాదవ్, జనార్దన్‌రాజు బి.ఎస్ రంగరాజన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ బోర్డు సమావేశంలో..ప్రశాంతిరెడ్డి



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏర్పడిన తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి తొలి సమావేశం ఈనెల 18న తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో జరిగింది. టీటీడీ బోర్డు ఛైర్మెన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నెల్లూరుజిల్లా కోవూరు శాసనసభ్యురాలు, టీటీడీ పాలకమండలి సభ్యురాలు..వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో చేపట్టనున్న వివిధ సంస్కరణలపై సమావేశంలో చర్చించారు.







ఉత్తరక్రియలు



జననం 05.11.1929

నిర్యాణం 13.11.2024

ప్రేమానురాగాలను పంచిన అమృతమూర్తి, మా మాతృమూర్తి

శ్రీమతి కాటంరెడ్డి సుశీలమ్మ గారు

13.11.2024, బుధవారం స్వర్గస్తురాలైనారు.

వారి పవిత్రఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు - కోడళ్ళు

శివప్రసాద్ రెడ్డి - శోభ    కృష్ణప్రసాద్ రెడ్డి - సుజాత

ఆనంద్‌కుమార్ రెడ్డి - రేఖ

ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ 23.11.2024 శనివారం

ఉదయం చెన్నై, మైలాపూర్, 146, డా. రాధాకృష్ణన్ సలైలోని,

సవేరా హోటల్ నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

# శ్రీసిటీలో పెరగనున్న ఏసీల తయారీ

## • 'నిడెక్ ఇండియా' ఉత్పత్తుల ప్రారంభం



ఎలక్ట్రిక్ మోటార్లు తయారు చేసే జపాన్‌కు చెందిన ప్రముఖ నిడెక్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ 'నిడెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' శ్రీసిటీలో ఈనెల 15న తన నూతన పరిశ్రమలో ఉత్పత్తిని ప్రారంభించింది. భారతదేశ ఎయిర్ కండీషనర్ (ఏసీ) తయారీరంగంలో ఇదో ప్రధాన మైలురాయి అని చెప్పవచ్చు. ఈ సందర్భంగా, పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో చెన్నైలోని జపాన్ కాన్సులేట్ జనరల్ టకాహషి మునియోతో, నిడెక్ చైర్మన్ హిరోషి కోబె, నిడెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కెయిజీ ఒషిమా, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. శ్రీసిటీ డొమెస్టిక్ టారిఫ్ జోన్‌లో ఏర్పాటైన ఈ ప్లాంట్ లో 2025 జనవరి నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తులు ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.50 కోట్ల పెట్టుబడితో 6 మిలియన్ మోటార్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో 200 మందికి ఉద్యోగాలు లభించడం విశేషం. డైకిన్, వోల్టాస్, అంబర్, హావెల్స్‌తో సహా ప్రధాన ఏసీ పరిశ్రమలకు కంపెనీ ఉత్పత్తులను సరఫరా చేయనుందని నిడెక్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కెయిజీ ఒషిమా తెలిపారు. తమ కొత్త ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంచుకున్నందుకు నిడెక్ ఇండియాను టకాహషి మునియోతో అభినందించారు. భారత దేశపు ప్రధాన వ్యాపార కేంద్రాలలో ఒకటిగా, ముఖ్యంగా జపాన్ పెట్టుబడులకు అనువైన సురక్షిత ప్రాంతంగా ఆయన శ్రీసిటీని ప్రశంసించారు.

### ఏపీ ప్రభుత్వ సహకారం, దార్శనికత అద్భుతం...

గృహోపకరణాలు మరియు ఆటోమొబైల్స్ కోసం మోటార్ల తయారీతో వ్యాపారం ప్రారంభించి, ఖాతాదారుల విశ్వాసాన్ని చూరగొని క్రమంగా వ్యాపారాన్ని విస్తరించామని నిడెక్ చైర్మన్ హిరోషి కోబె మాట్లాడుతూ తెలిపారు. శ్రీసిటీ పరిశ్రమ ద్వారా ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. 2014లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమను జపాన్‌లో కలిసి, రాష్ట్రానికి రావాలని ఆహ్వానించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అది ఇన్నాళ్లకు ఫలించి ప్లాంట్ ఏర్పాటుకు దారి తీసిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ఎయిర్ కండీషనర్ల తయారీ కేంద్రంగా శ్రీసిటీ అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

నిడెక్ పరిశ్రమ రావడంతో ఇక్కడ పర్యావరణ వ్యవస్థ మరింత బలోపేతం అయిందని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చెప్పారు. శ్రీసిటీ ప్రస్తుతం ఎయిర్ కండిషనింగ్ తయారీ కేంద్రంగా మారడంతో పాటు వివిధ తయారీ రంగాలకు చెందిన 220 ప్రముఖ సంస్థలకు నిలయంగా నిలిచిందన్నారు. అగ్రశ్రేణి ఏసీ సంస్థలు మరియు అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో త్వరలో దేశంలోని ఏసీల ఉత్పత్తిలో సగానికి పైగా శ్రీసిటీలో తయారవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యాపార పర్యావరణ వ్యవస్థను ప్రోత్సహించడంలో శ్రీసిటీ పాత్రను ప్రస్తావిస్తూ, దీనివలన లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గడం, ఆవిష్కరణలకు ప్రోత్సాహం రూపంలో ఇక్కడ కంపెనీలు మరింత ప్రయోజనం పొందుతాయని వివరించారు.



# సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

## 8.40 కోట్లతో నిర్మాణం జరుగుతుందన్న మంత్రి ఆనం

ఎట్టకేలకు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవతో సోమశిలలో వెలసివున్న శ్రీ కామాక్షి సమేత సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి కృషి ప్రారంభమైంది. గతంలో భారీవానలు, వరదల ధాటికి పూర్తిగా దెబ్బతిన్న ఆ ఆలయాన్ని దాదాపు 8.40 కోట్ల రూపాయల వ్యయంతో పునర్నిర్మించనున్నారు. ఈనెల 16న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి చేతులమీదుగా భూమిపూజ జరిగింది. ఆలయ పునర్నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరణోత్సవం వేడుకగా నిర్వహించారు. తొలుత, స్వామీజీని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, వేదపండితులు ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతి మహాస్వామి వారి దివ్యాశీస్సులతో శ్రీ సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ జరగడం మహద్భాగ్యమన్నారు. ఈ ఆలయ పునర్నిర్మాణంలో శృంగేరి పీఠం తరపున ఒక లక్షా నూటపదహారు రూపాయల భాగస్వామ్యాన్ని అక్షయ నిధిగా అందించి పనులు ప్రారంభించాలని స్వామివారు ఆశీస్సులు అందించడం సంతోషం కలిగిస్తోందన్నారు. గతంలో వరదల్లో కొట్టుకుపోయిన ఆలయాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, సోమశిల సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఈ ఆలయ పునర్నిర్మాణం విషయం చెప్పగా, తక్షణమే పనులు చేపట్టాలంటూ నిధులు మంజూరుచేశారని మంత్రి తెలిపారు.

# లష్కర్ల ఉద్యోగాలను భర్తీ చేయండి

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సుమారు 1200 లష్కర్ ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే పరిశీలించి భర్తీ చేయాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఇటీవల ఆయన జల వనరుల శాఖ సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజును కలిసి ఆమేరకు వినతిపత్రం అందజేశారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్


# అర్చకులకు గౌరవ వేతనం ఇవ్వాలి

**ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్**



దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అమరావతిలో ఈ నెల 18న కలిశారు. గూడూరు నియోజకవర్గ పరిధిలోని ఆలయాల్లో పూజలు చేస్తున్న అర్చకులకు గౌరవేతనం అందించాలని వినతిపత్రం అందించారు. దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. నాయకులు అమరేంద్ర, దామోదర్, మధుయాదవ్, మోహన్‌రెడ్డి, మధు, జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదులో నాయకుల కృషి అభినందనీయం



గూడూరు నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాల నమోదు విషయంలో నాయకులు, కార్యకర్తల పనితీరు అభినందనీయమని చిత్తూరుజిల్లా బీజేపీ ఇన్‌ఛార్జి విశ్వనాథం తెలిపారు. ఈ నెల 17న గూడూరు పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణంనాయుడు ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాయకులు దయాకర్, బిందురెడ్డి, శ్రీనివాసులు, సురేష్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# మినీ గురుకులంలో సేవా కార్యక్రమాలు

గూడూరు మినీగురుకులంలో శ్రీకృష్ణ సేవాసమితి దాతృత్వంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మయూరి శ్యాంయాదవ్ తల్లి బండి వనమ్మ మూడవ వర్ధంతిని పురస్కరించుకొని చదువుకునే విద్యార్థులకు ఇటీవల ఒక సైకిలు బహుకరణ, అదేవిధంగా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు ఎస్సే రైటింగ్, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఎలెక్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఫాస్ట్ అసిస్టెంట్ గవర్నర్స్ దశరథరామిరెడ్డి, మయూరిశ్యాంయాదవ్, రాంప్రసాద్, కిరణ్‌చక్రవర్తి, రవికుమార్, జి.జి.నాయుడు, మేరీ ప్రియత పాల్గొన్నారు. కాగా, మయూరి శ్యాంయాదవ్ తల్లి వర్ధంతిని పురస్కరించుకొని గవళ్ళపాలెంలో వున్న ఓంసాయిరాం వసతి గృహంలో అన్నదానం జరిగింది.

# పేదలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలి



ఇళ్ళు లేని పేదలకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలను మంజూరు చేయాలని, పేదలకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఐ నాయకులు కాలేషా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గూడూరు పురపాలక సంఘం వద్ద, నెలబల్లి రెట్టపల్లి సచివాలయం వద్ద ఈ నెల 18న స్థానికులతో కలసి ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పలసరుకుల పంపిణీ



గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈనెల 17వ తేదీ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకం ద్వారా డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిల ఆర్థిక సహకారంతో 20 మంది వృద్ధులకు నెలకు సరిపడా పలసరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి ప్రతినెల మూడవ ఆదివారం క్రమం తప్పకుండా ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారమందిస్తూ, ప్రోత్సహిస్తున్న డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ రోహిణిలకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండి శ్రీనివాసులురెడ్డి, ఎరమాక కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, లక్కు కృష్ణారెడ్డి, హరనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు జేవీవీ కూరగాయలు

గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సంఘం డైరీ మాధవరెడ్డి దాతృత్వంలో ఇటీవల దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేశారు. జె.వి.వి.అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జె.వి.వి గత15 నెలలుగా విభిన్న ప్రతిభావంతులకు ప్రతి నెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచు నారాయణ, పురుషోత్తమరావు, గుర్రం విజయ్‌బాబు, సుమన్‌రెడ్డి, ఇబ్రహీం, జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



# జానకిరామ.. రామాయణం 40

- ఊటుకూరు జానకి రామారావు



ఇంకా సంద్రం ఎండిపోయినట్లు, చంద్రుడు ఆకాశం నుండి రాలి పడిపోయినట్లు, భద్రగజాల దంతాలు విరిగిపోయి నట్లు, మండే మండే అగ్ని హఠాత్తుగా ఆరిపోయినట్లు, భూమి బ్రద్దలైనట్లు, భూమి అంతా పొగ ఆవరించి చెట్లు ఎండిపోయి నట్లు కనపడింది.

ఏమో! మా అయిదుగురిలో ఎవరో ఒకరికి మరణం సంభ వించవచ్చునేమో! నా గొంతు ఎండిపోతుంది, ఏదో తెలియని భయం మనస్సును పట్టి పీడిస్తుంది అని భరతుడు తన స్నేహితు లతో పలుకుతూ ఉండగనే అయోధ్య నుండి వచ్చిన దూతలు సభలో ప్రవేశించారు.

అయోధ్య నుండి వచ్చిన దూతలు కేకయ రాజు అశ్వపతికి, యువరాజు యుధాజిత్తునకు నమస్కరించి నిలుచొని, భరతుని వంక చూసి 'మన రాజపురోహితులు, మంత్రులు నిన్ను శీఘ్రంగా తిరిగి రమ్మని కోరినారు. నీతో చాలా తొందరపని ఉన్నదట!' అని పలికి, వారు తెచ్చిన విలువైన కానుకలను భరతుడి ద్వారా కేకయ రాజుకు అందించారు.

అప్పటికే తనకు వచ్చిన కలతో దిగులుగా ఉన్న భరతుడు వారినుద్దేశించి, మా తండ్రి గారు క్షేమమేనా? మా రాముడు, మహాత్ముడైన లక్ష్మణుడు కుశలమే కదా?

పూజ్యురాలు ధర్మంనందే ఆసక్తిగలదీ, ధర్మం నెరిగినదీ, ధర్మాన్నే చూచేటటువంటిది ధీమంతుడైన రాముని తల్లి కౌసల్యా మాత క్షేమమే కదా!

ధర్మాలు తెలిసినది, లక్ష్మణ, శత్రుఘ్నుల కన్నతల్లి, మా మధ్యమాంబ సుమిత్రామాత కుశలమే కదా!.

తన సుఖాన్నే కోరుకునేది(ఆత్మ కామా), ఎల్లప్పుడూ తీవ్రంగా ప్రవర్తించేదీ(సదా చణ్డీ), కోపస్వభావం కలదీ(క్రోధనా), తానే బుద్ధిమంతురాలు అనే గర్వం కలది (ప్రాజ్ఞమానినీ) అయిన నా తల్లి కైక ఏ రోగం లేకుండా ఉంది కదా... ఆవిడ కుశలమే కదా!

భరతుడు పలికిన మాటలు విన్న దూతలు! ఓ నరశ్రేష్ఠా నీవు ఎవరి క్షేమం కోరుచున్నావో వారందరూ క్షేమమే. నిన్ను ఐశ్వర్యం, లక్ష్మి వరించుచున్నవి శీఘ్రంగా రథంపై కూర్చొని ప్రయాణించవయ్యా!... అని తొందరపెట్టారు.

వీరి మాటలు విన్న భరతుడు తాతగారి వైపు తిరిగి నన్ను దూతలు తొందరపెడుతున్నారు, మరల మీరెప్పుడు రమ్మంటే... అప్పుడు వస్తాను అని సెలవు తీసుకొని, ఆయన ఇచ్చిన కానుకలు స్వీకరించి వాటిని నెమ్మదిగా వెనుక తీసుకు రమ్మని సేవకులకు చెప్పి, తాను శత్రుఘ్నునితో కలిసి బయలుదేరి ఏడవ నాటికి అయోధ్యా నగర పొలిమేరలకు చేరుకున్నాడు.

ఎప్పుడూ సందడిగా కావ్యగోష్ఠులు, గీత వాయిద్యాలు, భేరీ మృదంగ, వీణాధ్వనులు, నృత్యప్రదర్శనలతో కోలాహలంగా ఉండే అయోధ్య ఏ విధమైన జన సంచారం లేకుండా బోసి పోయిన వీధులతో, శ్మశాన నిశ్శబ్దంతో అడుగుపెట్టగానే ఒళ్ళు గగుర్పొడిచే వాతావరణంతో కనపడింది ఆయనకు.

ఆనందశూన్యమైన అయోధ్య గోచరమయ్యింది.

ఆయన మనసు ఈ వారంరోజులూ కీడు శంకిస్తూనే ఉంది. ఈ వాతావరణం చూడగనే అది మరింతగా బలపడింది.

తన రథసారథితో.. "సారథీ రాజు మరణించినప్పుడు ఏ వాతావరణం ఉంటుందో అది నాకు కనపడుతుంది. అయోధ్య లోని భవనాలన్నీ కళావిహీనం, శోభావిహీనమై కనపడుతు న్నాయి. దేవాలయాలలో నిత్యపూజలు జరుగుతున్నట్లుగా లేదు మాలికల శోభలేదు. అయోధ్య అంతా ఒక నిశ్శబ్దం ఆవరించి ఉంది. ఇది నేనెరిగిన అయోధ్యకాదు!" అని అంటూ.. సంతోష హీనుడై తండ్రి గృహంలో ప్రవేశించాడు.

తనను చూడగనే ఎదురు వచ్చి దుమ్ముకొట్టుకు పోయి ఉన్నాసరే తన శరీరాన్ని ప్రేమతో నిమిరి తన శిరస్సు వాసన చూసి గాఢంగా కౌగలించుకొనే ప్రేమమూర్తి తన తండ్రి అచట లేడు!

తన తల్లి ఇంట్లో ఉన్నాడేమో అని కైక ఇంట అడుగు పెట్టాడు. కొడుకును చూడగనే ఎగిరి గంతేసి ఆసనం నుండి లేచింది కైక.

(మహర్షి వాల్మీకి కైక గురించి వాడిన విశేషణాలు గమ నించండి!

ఆత్మ కామా : తన సుఖాన్నే కోరుకునేది

సదా చణ్డీ : ఎల్లప్పుడూ తీవ్రంగా ప్రవర్తించేది

క్రోధనా : ఎప్పుడూ కోపంగా ఉండేది

ప్రాజ్ఞమానినీ : తానే బుద్ధిమంతురాలిని అనే గర్వం కలిగి నటువంటిది.

మనుషుల స్వభావం గూర్చి మహర్షి వాడే విశేషణాలు రామాయణంలో కోకొల్లలు! వాటిని విశ్లేషిస్తే చాలు! అపారమైన మానవ మనస్తత్వ శాస్త్రం మనకు కరతలామలకమవుతుంది.)

భరతుని దగ్గరకు తీసుకొని నాయనా ప్రయాణమై ఎన్ని రోజులైంది? అలసట ఏమీ కలుగలేదుకదా? అక్కడ అందరూ కుశలమేకదా? అని ప్రశ్నల వర్షం కురిపించింది కైక.

అన్నింటికీ వినయంగా సమాధానం చెప్పి, అమ్మా! నా తండ్రిగారు ఎక్కడ? ముందు ఆయనను చూడాలి, ఆయనకు పాదాభివందనం చేయాలి! ఎక్కువగా ఆయన నీ గృహంలోనే కదా ఉండేది, నేడేమి ఆయన కానరావటంలేదు..

నీ ఇల్లు అంతా శోభావిహీనంగా ఉంది ఎందుకు? అం దరి ముఖాలలో దైన్యం కనపడుతుంది కారణమేమిటి? అని ప్రశ్నించాడు.

నాయనా!! ప్రాణులన్నింటికి ఏది చివరి గతియో నీ తండ్రి ఆ గతిని పొందాడు అని చాలా మామూలుగా, అతితేలికగా ఏదో ప్రియమైన విషయం పలుకుతున్నట్లుగా పలికింది కైక!

ఆ వార్త చెవిన పడీ పడటంతోటే అయ్యో చచ్చితినంటూ నేలమీద దబ్బున పడిపోయాడు భరతుడు.

మొదలు నరికిన చెట్టులా పడిపోయి తీవ్రమైన వేదనతో దుఃఖిస్తున్న కుమారుడిని లేవనెత్తింది కైక.

అమ్మా! నా అన్న రామునికి పట్టాభిషేకమో మరి ఏ ఇతరమైన యజ్ఞమో చేయుచూ నన్ను రమ్మన్నాడనుకొని ఎంతో సంతోషంతో వచ్చాను. తండ్రికి అంతిమ సంస్కారాలు చేసిన రామలక్ష్మణులు ధన్యులు.

అమ్మా త్వరగా రామునికి కబురుపంపు నేను వచ్చానని. ఏ కార్యమునైనా అవలీలగా సాధించే ఆ రాముడే నా సోదరుడు, తండ్రి, బంధువు, ఆయనకు నేను దాసుడను.

తండ్రి పాదాలు పట్టుకోవడానికి నోచకుంటిని. ఇక అన్న గారే నా తండ్రి, ఆయన పాదాలు పట్టుకోవాలి! ఇప్పుడిక ఆయనే నా గతి.

అమ్మా చనిపోతూ చనిపోతూ నా తండ్రి ఏమి పలికినాడు? అని అడిగిన భరతుడిని చూసి, "సీతాసమేతుడై తిరిగి వచ్చిన రాముని, మహాబాహువైన లక్ష్మణుని చూడగలిగిన వారు ధన్యులు అంటూ హా రామా హా సీతా హా లక్ష్మణా" అంటూ ప్రాణాలు విడిచాడు నీ తండ్రి అంటూ నిస్సిగ్గుగా పలికింది కైక.

ఇది ఇంకొక అప్రియవార్త భరతునకు.

ఎక్కడికెళ్ళాడు రాముడు? ఇపుడిక్కడలేడా? అని అడిగిన భరతునికి ఏదో ప్రియమైన విషయం చెపుతున్నట్లుగా "రాముడు దండకారణ్యానికి పంపబడినాడు" అని అంది కైక.

రాముడు దేశం నుండి ఎందుకు వెళ్ళ గొట్టబట్టాడు? అధర్మకార్యం ఏమైనా చేశాడా?

ఏ బ్రాహ్మణుని ధనాన్ని అపహరించలేదు కదా?

ఏ వ్యక్తిని అకారణంగా హింసించ లేదు కదా?

పరుల భార్యలపై కోరిక చూపలేదు కదా?

పసి పిల్లలను చంపేవాడిని వెడలకొట్టినట్లు రాముని దండకారణ్యానికి ఎందుకు పంపారు?

ఆవేదనతో తల్లిని ప్రశ్నిస్తున్నాడు భరతుడు!

మూర్ఖురాలూ.. తానే బుద్ధిమంతురాలు అనే గర్వం కల కైక భరతుని మాట విని ఇలా అన్నది.

రాముడు పరుల భార్యలను కంటితో చూడటమా!

పరుల ధనం అపహరించటమా?

పరులను హింసించడమా? అలాంటివి కలలో కూడ చేయడు.

నేనే నీ తండ్రిని కోరాను రాముని అరణ్యాలకు పంపి నీకు రాజ్యం ఇమ్మని, నీ తండ్రి నాకిచ్చిన వరాలకు అనుగుణంగా నేనడిగినట్లే చేశాడు. రాముడు కనపడక అతని మీద గల ప్రేమతో నీ తండ్రి క్రుంగిపోయి మరణించాడు.

భరతా నిష్కంటకమైన రాజ్యాన్ని ఇక స్వీకరించు!

..(సశేషం)

# కమ్ముకొస్తున్న 'మూడో ప్రపంచ' యుద్ధమేఘాలు




రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలయి దాదాపు మూడు సంవత్సరాలకు చేరుకుంటున్న వేళ మూడో ప్రపంచయుద్ధ భయాలు అలుముకున్నాయి. రెండు దేశాల మధ్య యుద్ధం మొదలయి మొన్న మంగళవారంతో 1000 రోజులు పూర్తయ్యాయి. దాదాపు మరో మూడు నెలలు గడిస్తే మూడు సంవత్సరాలు పూర్తవుతుంది. ఏదో ఒక అద్భుతం జరగకపోతుందా? శాంతి దూతల దౌత్యాలు ఫలించి ఉభయదేశాలు యుద్ధానికి ముగింపు పలకకపోతాయా? అని రెండు దేశాల పౌరులతో పాటు యావత్ ప్రపంచం ఆశావహ దృక్పథంతో ఉన్న వేళ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న నిర్ణయంతో శాంతి కాముకులు ఉలిక్కిపడ్డారు. ఉక్రెయిన్‌కు అమెరికా అందిస్తున్న దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా భూ భాగంపై దాడికి వినియోగించేందుకు అనుమతిస్తున్నట్లు బైడెన్ ప్రకటించారు. ఆ నిర్ణయంతో మాస్కోపైకి దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అవకాశం దొరికింది. ఉత్తర కొరియా సైన్యం నేరుగా రష్యా తరపున ఉక్రెయిన్‌పై యుద్ధంలో పాల్గొంటున్న నేపథ్యంలో బైడెన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. దీర్ఘశ్రేణి క్షిపణులను ఉక్రెయిన్ ఉపయోగించేలా అనుమతి ఇవ్వాలని చాలా రోజులుగా పశ్చిమ దేశాలతో పాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ బైడెన్‌పై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అలాంటి ఆయుధాలను వాడకుండా నిషేధం విధించడంవల్ల తమ నగరాలు, విద్యుత్‌గ్రిడ్లపై పుతిన్ సేనలు చేసే దాడులను అడ్డుకోలేక పోతున్నట్లు బైడెన్‌తో చెప్పారు.

బైడెన్ అనుమతించిన ఒకరోజు వ్యవధిలోనే అమెరికా తయారు చేసిన ATACMS క్షిపణులను రష్యా భూభాగాలపై ఉక్రెయిన్ ప్రయోగించింది. బ్రియాన్స్క్ ప్రాంతంపై ఉక్రెయిన్ ఆరు ATACMS క్షిపణులతో దాడులు చేసినట్లు రష్యా రక్షణ శాఖ ధ్రువీకరించింది. వాటిలో ఐదింటిని ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఒక క్షిపణి మాత్రం బ్రియాన్స్క్ ప్రాంతంలోని సైనిక స్థావరంపై పడిందని, దాంతో మంటలు చెలరేగినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ పరిణామంతో ఒక్కసారిగా ఉద్రి క్తతలు పెరిగాయి. బైడెన్ నిర్ణయంపై రష్యా భగ్గుమంది. రక్షణ శాఖ ఉన్నతాధికారు లతో రష్యా అధ్యక్షుడు పుతిన్ సమావేశమయ్యారు. ఈ క్షిపణి దాడులను అమెరికాతో కలిసి సంయుక్తంగా చేసిన యుద్ధంగానే పరిగణించాలని సమావేశం అభిప్రాయ పడింది. వెంటనే రష్యా తమ అణు విధానాన్ని సవరించింది. సవరించిన కొత్త విధానాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో రష్యా ఏ క్షణమైనా అణ్వాయుధాయులను ప్రయోగించే అవకాశం ఉందనే భయాందోళనలు నెలకొన్నాయి. బైడెన్ చర్య మూడో ప్రపంచయుద్ధానికి నాంది పలికేలా ఉందని రష్యా చట్టసభ సభ్యురాలు మారియా బుతీనా, క్రెమ్లిన్ అధికార ప్రతినిధి వ్లాదిమిర్ జబరోవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాజా పరిణామాలు మూడో ప్రపంచయుద్ధానికి దారితీసే పరిస్థితులున్నాయని ఆందోళన చెందుతున్న ఐరోపా దేశాలు తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తమ పౌరులను అప్రమత్తం చేశాయి. స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్, నార్వే తదితర నాటో సభ్య దేశాలు తమ పౌరులకు జాగ్రత్తలు చెబుతున్నాయి. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్వీడన్ తమ పౌరులకు కరపత్రాలు పంచుతోంది. పిల్లలకు డైపర్లు, మంచినీరు, ఆహారం, దీర్ఘకాలం నిల్వ ఉండే ఆహార పదార్థాలు వంటి వాటిని ముందస్తుగా నిల్వ చేసుకోవాలని కరపత్రాల్లో సూచించింది. బాంబుదాడులు జరిగితే వాటి నుంచి ఎలా రక్షించుకోవాలి? గాయాలయితే ప్రాథమిక చికిత్స ఎలా చేసుకో వాలి? ప్రాణనష్టం తగ్గించడానికి ఏమేమి చేయవచ్చు వంటి అంశాలతో కూడిన కరపత్రాలను పంచుతోంది. నార్వే, ఫిన్లాండ్, డెన్మార్క్ కూడా ఇలాంటి జాగ్రత్తలనే సూచిస్తూ తమ పౌరులకు కరపత్రాలు పంచడమో, ఈ మెయిళ్లు చేయడమో చేస్తున్నాయి. రష్యా వద్ద అపారంగా అణ్వాయుధాలు పోగుపడి ఉన్నాయి. ప్రపంచం లోకెల్లా అత్యధికంగా అణు వార్‌హెడ్లు ఉన్న దేశం రష్యానే. 1994లో సోవియట్ యూనియన్ ఆఫ్ రష్యా నుంచి విడిపోయే నాటికి ఉక్రెయిన్ వద్ద కూడా భారీగానే అణ్వాయుధాలుండేవి. అయితే రష్యాతో ఒప్పందంలో భాగంగా వాటన్నింటినీ నాశనం చేసేసింది. అయితే అమెరికా, నాటో దేశాలు ఉక్రెయిన్‌కు అండగా ఉండ డంతో ప్రపంచాన్ని అణు దాడుల భయం వెంటాడుతోంది.

ఇటీవల అమెరికాలో జరిగిన ఎన్నికల్లో జో బైడెన్ ఓడిపోయి ట్రంప్ గెలిచారు. వచ్చే ఏడాది జనవరి 20న ఆయన అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తారు. అధికార మార్పిడి జరగడానికి ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండగా, పదవి నుంచి వైదొలగే ముందు ఇంతటి వివాదాస్పద, పెద్ద నిర్ణయం తీసుకోవడంపై బైడెన్‌పై విమర్శలు వస్తున్నాయి. నిర్ణయం తాలూకూ ఫలితాన్ని పక్కనపెడితే, పదవి వీడేముందు ప్రపంచాన్ని ప్రభావితం చేసే పెద్ద నిర్ణయాన్ని తీసుకోవడం నైతికంగా సరికాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బైడెన్ నిర్ణయాన్ని డొనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తారా లేదా అనే దానిపై అనిశ్చితి కొనసాగుతోంది. ఎందుకంటే స్వతహాగా ట్రంప్ వేరే దేశాల మధ్య జరిగే యుద్ధాలకు, వివాదాలకు అమెరికా దూరంగా ఉండాలన్న వైఖరిని అవలంభిస్తారు. పలు సందర్భాల్లో ఇదే మాటను స్పష్టం చేశారు కూడా. ఇతర దేశాల యుద్ధాల్లో తలదూరిస్తే అమెరికా ఆర్థికంగా నష్టపోతుందని ఆయన బలంగా విశ్వసిస్తారు. పైగా ట్రంప్‌కు, పుతిన్‌కు మధ్య సత్సంబంధాలే ఉన్నాయి. ట్రంప్ అధికారం చేపట్టేవరకు రష్యా కఠిన నిర్ణయాలు తీసుకోకూడదని ఆకాంక్షిద్దాం.



తుమ్మల బాల గంగాధర్ తిలక్

# మసీదు తరలింపుకు.. సమయం ఇవ్వండి

- రైల్వే జీఎంకి వినతి



కోవూరు నియోజకవర్గం పడుగుపాడు రైల్వేస్థలంలో ఉన్న మసీదు తరలింపుకు కొంత గడువు ఇవ్వాలని కోరుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఓఎస్డీ పెంచలరెడ్డి, మసీదు కమిటీ సభ్యులు బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌కు వినతి పత్రం ఇచ్చారు. మసీదును తొలగించాలని రైల్వే అధికారులు ఆదేశించివున్న నేపథ్యంలో, అందుకు కొంత సమయం ఇవ్వాలని కమిటీ సభ్యులు విన్నవించగా, రైల్వే జీఎం సానుకూలంగా స్పందించి, తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

# ఇచ్చట వార్తలు అమ్మబడును

(మొదటిపేజీ తరువాయి)

మధ్య జోరుగా నడుస్తోంది. పత్రికా సంపాదకులంటే ఒకప్పుడు ఎంతో విలువుండేది. ఇప్పుడు పత్రికాధిపతులు చెప్పిందే 'రాజ్యం'. ప్యాకేజీలు మాట్లాడుకుని పార్టీలకు ఏకపక్షంగా వంతపాడే పాత్రను, ఆ పార్టీల ప్రత్యర్థులను పరుష పదజాలంతో దూషించే భూమికని పోషిస్తున్నారు. ప్రతిఫలంగా పదవులు, కాంట్రాక్టులు పొందుతున్నారు. ఇందుకు తెలుగునాటే చాలా ఉదాహరణలున్నాయి.

ఒక ప్రముఖ ఆంగ్ల దినపత్రిక యజమానికి ఒక జాతీయపార్టీ నుంచి గతంలో రాజ్యసభ సభ్యత్వం దక్కింది. ఆయన ఆ పార్టీకి పెద్ద సానుభూతిపరుడు అన్నది జగమెరిగిన సత్యం. తెలుగునాట ఒక ప్రముఖ పత్రికకు పోటీగా రంగంలోకి దిగి పత్రికను స్థాపించి కాంగ్రెస్‌పార్టీకి అండగా నిలచిన వ్యాపార దిగ్గజానికి ఉమ్మడిరాష్ట్రంలో ఓ మహానేత రాజ్యసభ పదవి ఇప్పించారు. తన ప్రత్యర్థులను ఆ పత్రికలో నిత్యం ఎండగట్టే బాధ్యతను నిర్వర్తించినందుకు ప్రతిఫలంగా ఆ పదవితో ఆయనని సత్కరించారు. ఆ అగ్రనేతే రోజువారీ పాత్రికేయంలో తనవైపు స్పష్టంగా మొగ్గుచూపే వివిధ పత్రికల్లోని జర్నలిస్టులకు వివిధ సంస్థల ఛైర్మెన్ పదవులను కట్టబెట్టారు. రాష్ట్రం విడిపోయాక రికార్డు స్థాయి మెజార్టీతో ఆంధ్రాలో అధికారంలోకి వచ్చిన కొత్త పార్టీ అధినేత కూడా తనను నమ్ముకున్న జర్నలిస్టులకు పెద్దపెద్ద పదవులే కట్టబెట్టారు. ఏకంగా ప్రభుత్వ జీతభత్యాలిచ్చే సలహాదారుల పదవులు అప్పజెప్పారు. మరో జర్నలిస్టుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే చట్టబద్ధ సంస్థలో సభ్యుడిగా అవకాశం కల్పించారు. ఇక ఇటీవల కాలంలో 'ఆంధ్రా'లో కూటమి అధికారంలోకి వచ్చేలా మీడియా పరంగా పూర్తిగా సహకరించినందుకు, ఓ పార్టీకి సొంత టీవీ ఛానెల్‌లా అంకితమైనందుకు ప్రతిఫలంగా ఆ ఛానెల్ అధిపతికి పెద్ద పదవే దక్కింది. గతంలో నెల్లూరులోని ఓ పాత స్థానిక పత్రిక నిర్వాహకులు శాసనమండలి సభ్యత్వంతో పాటు కొన్ని స్థానిక సంస్థల ఛైర్మెన్ పదవులు కూడా పొందారు. ప్రెస్‌లు, సంస్థల కార్యాలయాలు నిర్మాణాల పేరుతో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలని తీసేసుకుంటున్నారు. గుట్టు చప్పుడు కాకుండా వాటిని అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు.

## ప్రచారానికి కాదేది అనర్హం అన్నట్లుగా!

ప్రధానపాత్ర పోషిస్తున్న మీడియా సంస్థలు, వాటి అధిపతులు, అందులో పనిచేసే జర్నలిస్టులకే కాకుండా 'ప్రచారానికి కాదేది అనర్హం అన్నట్లుగా' తమకు ఉపయోగపడే యూట్యూబ్ ఛానెళ్ళ వారికి కూడా ప్రభుత్వాలు పదవులు కట్టబెడుతున్నాయి. ప్రయోజనాలు కల్పిస్తున్నాయి. తెలుగునాట పెద్ద ఛానెల్‌గా ఎదిగిన ఒక యూట్యూబ్ ఛానెల్ యజమానికి గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే కార్పొరేషన్‌కు అధిపతిగా నియమించింది. తమ మనసెరిగి మసలుకునే విలేకరులని ప్రభుత్వం తరపున పీఆర్వోలుగా, వివిధ నగరాల్లో తమ ప్రతినిధులుగా నియమించుకునే సంప్రదాయాన్ని కూడా పార్టీలు మొదలు పెట్టాయి. ఇంతేకాదు.. ఇలా చాలాచోట్ల అనేకమంది మీడియా అధినేతలు వివిధ పార్టీలకు గొడుగుపట్టి పదవులు, కాంట్రాక్టులు దక్కించుకున్నారు. మీడియా అధిపతులు తమ ఎస్టేటులను విస్తరించుకునే రాజమార్గంగా జర్నలిజాన్ని వాడేసుకుంటున్నారు. మీడియాను ఫోర్త్ ఎస్టేట్ అని పిలవాలంటేనే సిగ్గుపడే పరిస్థితులు ప్రస్తుత మీడియా సమాజంలో ఏర్పడ్డాయి.

## మారుతున్న మర్యాద!

గతంలో రాజకీయ నాయకులు విధి నిర్వహణలోవున్న సీనియర్ జర్నలిస్టుని పలకరించేటప్పుడు 'ఏం సార్ - ఏమండి - చెప్పండి' అని గౌరవంగా సంబోధించే వారు. ఇప్పుడు అదే నేతలు 'ఆ... ఏమిటి చెప్పు..' అనే స్థాయికి పిలుపు పడిపోయింది. కనీసం ఆ జర్నలిస్టు పేరు ఉచ్చరించడానికి కూడా ఆ నేతలకి నోరు రావడంలేదు. మీడియా అధిపతులతో సదరు నాయకుడి పార్టీకి ఉన్న బంధం అలాంటిది. వార్తా పత్రికలు రాజకీయపార్టీల దత్తపుత్రికలుగా మారితే పరిస్థితి ఇలాగే ఉంటుంది. న్యూస్ ఛానెళ్ళు నేతల కౌగిళ్ళలో బందీలైతే మర్యాద మంచినీళ్ళ ప్రాయమే అవుతుంది.

"ఇచ్చట వార్తలు అమ్మబడును" అని మీడియా సంస్థలు ఇలాగే బోర్డులు తగిలించుకునే సంస్కృతి కొనసాగిస్తే, భవిష్యత్తులో నాలుగు మూల స్తంభాలలో నుండి మీడియాని ప్రజలే ఖచ్చితంగా వెలేస్తారు!





# మాగుంట పార్వతమ్మ సేవలు చిరస్మరణీయం

**అసెంబ్లీలో నివాళి**

దివంగత నేత మాగుంట సుబ్బరామరెడ్డి సతీమణి, ఒంగోలు మాజీ ఎంపీ, కావలి మాజీ ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ మృతికి ఇటీవల అసెంబ్లీ నివాళులర్పించింది. ప్రజాప్రతినిధిగా ఆమె చేసిన సేవలను సభ ప్రస్తుతించింది.

1996లో ఒంగోలు పార్లమెంట్ సభ్యురాలిగా, 2004-09లో కావలి శాసనసభ్యురాలిగా ఆమె ఒంగోలు, కావలి ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషిచేశారని, ఆమె సేవలు చిరస్మరణీయమని శ్లాఘించింది. అనంతరం, ఆమె ఆత్మశాంతికై ప్రార్థిస్తూ శాసనసభలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

### వెంకటయ్య మృతిపట్ల..

# వెంకయ్య విచారం

ఉదయగిరి నియోజకవర్గం దుత్తలూరు మండలం కట్టకిందపల్లి గ్రామ వాస్తవ్యులు కూచి వెంకటయ్య పరమపదించారని తెలిసి ఎంతో బాధపడ్డానని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'వెంకటయ్య వ్యక్తిగతంగా మంచి మనిషి. నేనంటే ఎంతో అభిమానం చూపేవారు' అని పేర్కొంటూ, ఉదయగిరి ప్రాంతం నుంచి తాను శాసనసభ్యుడిగా పోటీ చేసినప్పటి నుంచి అనేక పర్యాయాలు ఆ ప్రాంతాల్లో తన తరఫున ప్రచారం కూడా చేశారని, ఆ తర్వాత కూడా తానంటే ఎంతో అభిమానంతో ఉండేవారని ఆయన వెంకటయ్యతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. వెంకటయ్య ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

### ఎన్‌బికెఆర్

# అధ్యాపకురాలికి డాక్టరేట్



విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి ఇంజనీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రిక్ విభాగం అధ్యాపకురాలు పి.ధనసెల్వికి డాక్టరేట్ లభించింది. 'ఇంటెలిజెంట్ పవర్ సిస్టమ్ స్టెబిలైజర్స్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ట్రాన్సియెంట్ స్టెబిలిటీ ఇన్ మల్టీమిషన్ పవర్ సిస్టమ్'పై చేసిన పరిశోధనకు జెఎన్‌టీయు విశ్వవిద్యాలయం నుంచి ఆమె డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి, డా.ఎస్.సురేష్‌రెడ్డి ఆమెను అభినందించారు.

### విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్‌గా

# నరసింహారావు



నెల్లూరు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్‌గా నరసింహారావు ఈ నెల 20న నెల్లూరులోని విజిలెన్స్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం



నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ యాచమనేని బృంద, పాకాల శ్రీవల్లి, పాకాల శ్రీకాంత్, చేడిమాల ఉమారాణి, చేడిమాల విజయకుమార్‌లు ఇటీవల రూ.5లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆ చెక్కును క్యాన్సర్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఐ.భక్తవత్సలరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. నాగేశ్వరరావులకు అందజేశారు. ఆసుపత్రిలో రేడియోథెరపీ బ్లాక్ అభివృద్ధికి ఆ మొత్తాన్ని వినియోగించాలని వారు కోరారు

### మెడికవర్'లో విజయవంతంగా..

# 'ఇబియుఎస్' ప్రక్రియ!

**- డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి**



సంక్లిష్టమైన ఊపిరితిత్తుల పరిస్థితులను ఖచ్చితత్వంతో గుర్తించడానికి రోగులకు సకాలంలో మరియు సమర్థవంతమైన చికిత్సలను నిర్ధారించే ఇబియుఎస్ ప్రక్రియలో నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రి ముందంజ వేస్తోంది. ఇప్పటికి 50 విజయవంతమైన ఇబియుఎస్ (ఎండోబ్రోన్చియల్ అల్ట్రాసౌండ్) విధానాలను పూర్తిచేసినట్లు ఇంటర్వెన్షనల్ పల్మోనాలజిస్ట్ మరియు క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటంరెడ్డి కౌశిక్‌రెడ్డి తెలిపారు. ఇదెంతో గర్వకారణమైన విషయమని ఆయన చెప్పారు. నెల్లూరులో అధునాతన పల్మనరీ డయాగ్నస్టిక్స్‌లో ప్రతిభ కలిగిన ఏకైక హాస్పిటల్స్ మెడికవర్ హాస్పిటల్స్ అని ఆయన కొనియాడారు. 'ఇబియుఎస్' అనేది క్యాన్సర్లు, క్షయవ్యాధి, ఛాతీలో విస్తరించిన శోషరస కణుపులు లేదా ద్రవ్యరాశికి సంబంధించిన ఇతర పరిస్థితులతో సహా ఊపిరితిత్తుల వ్యాధులను నిర్ధారించడానికి, మరియు నిర్వహించడానికి ఉపయోగించే ఇన్వాసివ్ ప్రక్రియ అని ఆయన వివరించారు. మెడికవర్ హాస్పిటల్‌లోని అత్యాధునిక సాంకేతికతతో పాటు, తమ నైపుణ్యం..సిబ్బంది సహకారంతో, ఖచ్చితమైన, ముందస్తుగా చేసే రోగనిర్ధారణలు, రోగి సంరక్షణ ఫలితాలను మార్చడానికి వీలు కల్పించాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో 50 విధానాలను పూర్తిచేయడమన్నది ఒక మైలురాయి అని, దానిని చేరుకునేందుకు సహకరించిన తన బృందానికి, మెడికవర్ ఆసుపత్రి వారికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి



జిల్లాలో ఎక్కడా విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ విజయన్ ఆదేశించారు. నెల్లూరులోని విద్యుత్‌భవన్‌లో ఆయన అధికారులతో సమావేశమై, వినియోగదారులకు మెరుగైన సేవలందించాలని చెప్పారు. పీఎం సోలార్ విద్యుత్ పథకంపై వినియోగదారులకు అవగాహన కలిగించాలన్నారు. సీనియర్ అకౌంట్స్ అధికారి మురళి, ఏఇలు, డీఇఇలు పాల్గొన్నారు.



# నెహ్రూజీ సేవలు చిరస్మరణీయం

## డీసీసీ నేత చేవూరు

మన దేశానికి తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నేత చేవూరు దేవకుమార్‌రెడ్డి చెప్పారు. నెహ్రూజీ 135వ జయంతిని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరులోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న నెహ్రూ విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించడంతో పాటు భారతదేశాన్ని పునర్నిర్మించడంలో, ప్రజాస్వామ్యాన్ని స్థాపించడంలో నెహ్రూజీ అమోఘమైన కృషి చేశారని కొనియాడారు. దేశాభ్యున్నతి కోసం పంచ వర్షప్రణాళిక, భారీ ప్రాజెక్టుల నిర్మాణాల వంటివాటితో పాటు, బాలల హక్కులు- సంక్షేమం కోసం పరితపించారని చెప్పారు. నేడు చిన్నారుల బాల్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, సాంకేతిక ప్రపంచం, సామాజిక మాధ్యమాలు, స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌ల దుష్ప్రభావాలలో చాలామంది పిల్లలు చిక్కుకుపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యల నుంచి చిన్నారులను, విద్యార్థులను గట్టెక్కించే మార్గాలను అన్వేషించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, మీడియా ఇన్‌చార్జి సంజయ్‌కుమార్ అల్లావుద్దీన్, మల్లికార్జున్‌రెడ్డి, రాజా, హుస్సేన్ బాషా, మోహన్ గణేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

# 51వ సారి రక్తదానం



నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జిల్లా శాఖ బ్లడ్ సెంటర్‌లో ఈనెల 19న రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు..కేంద్ర ప్రభుత్వ న్యాయవాది దానరి రాజేంద్రప్రసాద్ సంవత్సరానికి 4సార్లు రక్తదానం చేయాలనే లక్ష్యంతో ఈ ఏడాది కూడా స్వచ్ఛందంగా 4వ సారి రక్తదానం చేసి అందరి ప్రశంసలందుకున్నారు. ఆరోజున ఆయన రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో 51వ సారి రక్తదానం చేశారు. రక్తదానమంటే ప్రాణదానమని, అందరూ రక్తదానం పట్ల అవగాహన కలిగించుకుని బాధితులను ఆదుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తిచేశారు. అనంతరం, తన పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక ఎంఎస్ఆర్ స్పాస్టిక్స్ సెంటర్‌లోని చిన్నారులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.మస్తానయ్య, కో-కన్వీనర్ నలుబోలు బలరామయ్యనాయుడు, న్యాయవాదులు పూనమల్లి రామకృష్ణ, గొల్ల కేశవులు, నిరంజన్, రవికుమార్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొని రాజేంద్రప్రసాద్ సేవలను అభినందించారు.

# అంకమ్మ తల్లికి అభిషేకాలు



మండల కేంద్రమైన విడవలూరులో వెలసివున్న గ్రామదేవత శ్రీ అంకమ్మ అమ్మవారికి ఈనెల17న అభిషేక సేవలు వైభవంగా నిర్వహించారు. వావిళ్ళ గ్రామానికి చెందిన తాతా వెంకయ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఉదయగిరిలో విద్యుత్ సమస్యలు తీర్చండి

## మంత్రి గొట్టిపాటికి.. ఎమ్మెల్యే కాకర్ల వినతి



నెల్లూరుజిల్లాలోని మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో రైతులు విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్నారని, వారి కష్టాలు తీర్చాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇటీవల అమరావతిలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉదయగిరి నియోజకవర్గంలో వర్షాధారంతో లేదా బోరు బావుల కింద రైతులు పంటలు పండిస్తారని, ఆ రైతాంగానికి విద్యుత్ చాలా అవసరమని, అవసరమైన చోట్ల 33 కె.వి సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసి విద్యుత్ పంపిణీలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన కోరారు. ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 69 మంది విద్యుత్ సిబ్బంది కొరత ఉందని, పరిశీలించి సిబ్బందిని కూడా నియమించాలని పేర్కొన్నారు. అదేవిధంగా 150 ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయని, వాటి స్థానాలలో కొత్తవి ఏర్పాటుచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇటీవల తుఫాన్ ప్రభావంతో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసి, లో-వోల్టేజీ సమస్య లేకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

# విపత్తుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి



ప్రకృతి వైపరీత్యాల నుంచి సురక్షితంగా బయటపడేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అధికారులకు సూచించారు. ఈనెల 18న నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భారీవానలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై స్థానిక అధికారులకు ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు అవగాహన కల్పించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలను ఎలా కాపాడాలనే అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు ఎలా తీసుకెళ్లాలి, గుండె నొప్పి వచ్చినప్పుడు సిపిఆర్ చికిత్స ఎలా చేయాలి వంటి అంశాలపై డెమో ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ్‌భాస్కర్, జిల్లా ప్రకృతి వైపరీత్యాల స్పందన శాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వీరశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ మోహన్‌రావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఇ-వనరుల అవగాహనపై..

# వివిఎస్‌యులో వర్క్‌షాప్




నెల్లూరు సమీపంలోని కాకుటూరులో ఉన్న విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వివిఎస్‌యు) డా.బిఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో ఇటీవల 'ఇ-వనరుల అవగాహన, ప్రాథమిక వినియోగం'పై వర్క్‌షాప్ జరిగింది. 'ఎలక్ట్రానిక్ రిసోర్సెస్ అవేర్‌నెస్ అండ్ ప్రాక్టీస్' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వివిఎస్‌యు ఉప కులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావు పాల్గొని ఇ-వనరుల ఆవశ్యకత, వాటి ఉపయోగాలు, పరిశోధనకు అవి ఉపయోగపడే తీరు గురించి వివరించారు. ముఖ్య ఉపన్యాసకులు మణికందన్ జయకృష్ణన్ మాట్లాడుతూ, ఇ-వనరుల ఆధారంగా అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ పరిశోధన పత్రాలు, పుస్తకాలు, ఇతర వనరుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం కన్వీనర్‌గా కేంద్ర గ్రంథాలయం ఇన్‌ఛార్జ్ డాక్టర్ వై. సుధారాణి వ్యవహరించారు. వివిఎస్‌యు రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ, 200మందికి పైగా ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టూకీగా...

### శ్రీ వెంగమాంబ దేవాలయంలో లక్ష దీపోత్సవం

కార్తీకమాసం సందర్భంగా దుత్తలూరు మండలం నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ దేవాలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని ఆలయంలో దీపాలు వెలిగించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

### వెన్నవాడలో విద్యార్థులకు హెల్త్‌కార్డులు

ఆత్మకూరు మండలం వెన్నవాడలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇటీవల వైద్యసిబ్బంది ఆరోగ్యపరీక్షలు చేసి, హెల్త్‌కార్డులు ఇచ్చారు. వ్యాధుల నివారణ, ఆరోగ్యం తదితర విషయాల పట్ల వారికి అవగాహన కలిగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్రకుమార్, వైద్యసిబ్బంది కృష్ణారెడ్డి, ఏఎన్ఎం భూదేవి, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విడవలూరులో బాధితులకు ఆహార పొట్లాలు పంపిణీ

వానలతో ఇబ్బందులు పడుతూ, వర్షపునీరు ఇళ్లలో ముడుగులు కట్టడంతో అన్నం కూడా వండుకోలేని స్థితిలో ఉన్న విడవలూరు ఇందిరమ్మకాలనీలోని అనేకమంది నిరుపేద గిరిజనులకు సంఘసేవకురాలు పల్లం శేషమ్మ ఇటీవల ఆహార పొట్లాలు అందించి తన మానవత్వాన్ని చాటుకుంది. స్థానిక దళిత నాయకుడు స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు

### రామతీర్థంలో వనభోజనాలు

కార్తీకమాసం సందర్భంగా, విడవలూరు మండలం రామతీర్థంలో ప్రసిద్ధమైన శ్రీ రామలింగేశ్వరాలయంలో ఈనెల 17న కార్తీక వనభోజనాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు కార్తీకదీపాలు వెలిగించి స్వామివారికి విశేష పూజలు చేశారు. నెల్లూరులోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఎంతో వేడుకగా జరిగింది.

### కాకర్లదిబ్బ గిరిజనులకు నిత్యావసర సరుకులు

ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం గ్రామం కాకర్లదిబ్బలోని 53మంది నిరుపేద గిరిజనులకు స్థానిక కోటేశ్వరి స్వచ్ఛంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఇటీవల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఏఆర్‌డి సిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయుడు సురేష్, మెట్టా శ్రీనివాసులురెడ్డి, రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

### జెండాదిబ్బలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

సంగం మండలంలోని జెండాదిబ్బ సమీపంలో ఈనెల 17న పేకాటాడుతున్న ముగ్గురిని సంగం ఎస్ఐ రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.5,200 స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేశారు.

### గంగవరంలో పంటపొలాల సందర్శన

ఇటీవల కురిసిన వర్షాలకు సీతారామపురం మండలం గంగవరంలో మునిగిన పంటపొలాలను మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నారెడ్డి సందర్శించి, రైతులకు తగు సూచనలిచ్చారు. నష్టాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పొలాల్లో నిండివున్న నీళ్ళను తీసేసి, గింజ మొలకరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

### తూర్పు రొంపిదొడ్లలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

వరికుంటపాడు మండలం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలోని ఎస్సీకాలనీ, శ్మశానవాటికకు వెళ్ళే మార్గంలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లంపాటి వెంగయ్య, నగేష్, ప్రసాద్‌రావు తదితరులు ఇటీవల శంకుస్థాపన చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో ఈ రోడ్లు మంజూరయ్యాయని వారు సంతోషం వ్యక్తం చేశారు.

### కోవూరు కోదండరామునికి పల్లకి సేవ

కార్తీకమాసం సందర్భంగా కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో కొలువైవున్న శ్రీ కోదండరామస్వామికి ఇటీవల వైభవంగా పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి నేత్రపర్వంగా పల్లకి సేవ నిర్వహించారు. మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ఆలయాన్ని దీపకాంతులతో దేదీప్యమానం చేశారు.

## ఆర్టీసీ నెల్లూరుజోన్ చైర్మెన్‌గా..
# సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ప్రమాణస్వీకారం





ఆర్టీసీ నెల్లూరుజోన్ చైర్మెన్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఈనెల 21న ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ, టీడీపీ నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ సంస్థ ప్రతిష్టను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులకు మెరుగైన సేవలందిస్తామని, ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి పాటుపడతామని చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు త్వరలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తామని ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్టీసీ ఛైర్మెన్ కొనకళ్ళ నారాయణరావు చెప్పారు. బస్సు చార్జీలను తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని, ఎలక్ట్రిక్ బస్సులను కూడా నడుపుతామన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 7వేల ఉద్యోగాలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ నెల్లూరు జోన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం, నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 4 సూపర్ లగ్జరీ బస్సులను, ఒక ఎక్స్‌ప్రెస్ బస్‌ను ఆర్టీసీ ఛైర్మెన్ ప్రారంభించారు. డెప్యూటి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, సన్నపరెడ్డి దయాకర్‌రెడ్డి, భరత్‌కుమార్‌యాదవ్, కర్నాటి ఆంజనేయరెడ్డి, నాగరాజారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున యాదవ్, వాకాటి నారాయణ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి తదితరులతో పాటు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



## చంద్రన్నను కలసిన.. చంద్రమోహనుడు

సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి, సర్వేపల్లి నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు, రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు, కొత్త పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలను ఆయన ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు.

## కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి




విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, కార్యదర్శి సుమన్ కోరారు. నెల్లూరు విద్యుత్‌భవన్ వద్ద ఈనెల 20న జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఆమేరకు విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయన్‌కు వినతిపత్రం సమర్పించారు.

# రైల్వేస్టేషన్ పనులను వేగవంతం చేయండి

### - దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశం



నెల్లూరు రైల్వేస్టేషన్‌కు సంబంధించిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని దక్షిణమధ్య రైల్వే మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అధికారులను ఆదేశించారు. ఇటీవల ఆయన నెల్లూరులో కొత్తగా నిర్మించిన రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ భవనాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత అభివృద్ధి పనుల గురించి ఆరా తీశారు. ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సిబ్బందికి చెప్పారు. నాలుగో నెంబరు ప్లాట్‌ఫారమ్‌లో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల వీడియోను తిలకించారు. ప్లాట్‌ఫారమ్‌లను కలుపుతూ నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ బ్రిడ్జిని, స్టేషన్ మాస్టర్ గదిలోని సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. డీఆర్ఎం నరేంద్రపాటిల్, స్టేషన్ సూపరింటెండెంట్ శివయ్య ఉన్నారు.

## డీకెడబ్ల్యు జాబ్‌మేళాలో.. 128 మందికి ఉద్యోగాలు



నెల్లూరులోని డీకెడబ్ల్యు కాలేజీలో ఇటీవల జరిగిన జాబ్‌మేళాలో 128 మందికి ఉద్యోగాలొచ్చాయి. టెన్త్, డిగ్రీ, ఐటిఐలలో పాసైన వారు 205 మంది ఈ జాబ్‌మేళాకు వచ్చారు. చెన్నై, శ్రీసిటీ, తడ ప్రాంతాలకు చెందిన 7 కంపెనీల ప్రతినిధులు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. డీకెడబ్ల్యు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమణారావు, జేకేసీ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలతో జాగ్రత్త!



విద్యార్థులు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని నవాబుపేట ఇన్స్‌పెక్టర్ షేక్ అన్వర్‌బాషా చెప్పారు. ఇటీవల నెల్లూరు పప్పుల వీధిలో ఉన్న శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొరియర్ పేరుతో మోసాలు, ఓటీపీలు, లోన్ యాప్స్ వంటివాటితో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, స్మార్ట్‌ఫోన్‌లను మంచికి ఉపయోగించుకోవాలని, పక్కదారి పట్టవద్దని హితవు పలికారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com